ప్రజావైద్యుడు డాక్టర్ సత్యపాల్ తులి

ప్రజాశక్తి సోపతి

అక్టోబర్ 12, 2014 ఆదివారం అనుబంధం

నియంత్రణే నివారణ మార్గం

- గోపగాని రవీందర్ 'నడక ముచ్చట్లు'
- మళ్లీ కందిలీ ముట్టిద్దాం!

చిత్రకళలో విప్లవాత్మక శైలి

“చిత్రకళకు జీవం పోసిన వాడిని నేను. ప్రకృతిలో ఏముందో నా చిత్రాలలోనూ అదే ప్రతిఫలిస్తుంది” అని సగర్వంగా చెప్పిన చిత్రకారుడు గియాట్టో. బైజాంటియన్ సంప్రదాయంపై తిరుగుబాటుగా ఇటలీలో వెల్లువెత్తిన చైతన్యానికి ప్రతీకలు గియాట్టో చిత్రాలు. ఇటలీలో ఒక పేద రైతు కుటుంబంలో 1267లో జన్మించారు. దాదాపు డెబ్బయి సంవత్సరాలు జీవించి, 8 జనవరి 1337లో ఈ లోకం నుంచి నిష్క్రమించారాయన. గియాట్టో కుడ్యచిత్రాలకు ఇటలీలో మంచి ఆదరణ వుంది. మధ్యయుగాల నాటి సంప్రదాయాలకీ, క్రైస్తవ సౌందర్యాత్మక అంశాలకీ సంబంధించిన చిత్రకళారీతుల్ని గియాట్టో బొమ్మలు చెబుతాయి. గియాట్టో వేసిన లాస్ట్ జడ్జిమెంట్ చిత్రం శతాబ్దాలు గడిచినా పురావైభవాన్ని కోల్పోకుండా నిలిచివుంది. మానవ ఉద్వేగాల్ని శరీరాలు ఎలా వ్యక్తం చేస్తాయో తన బొమ్మల ద్వారా తెలియజెప్పారు. 12, 13 శతాబ్దాల నాటి ఇటలీ ప్రజల చరిత్రను తెలుసుకోడానికి ఉపకరించే చిత్రాలివి. అప్పటివరకు వున్న సంప్రదాయరీతులపై తిరుగుబాటుగా సృజనకు పదును పెట్టిన విప్లవాత్మక శైలి ఆయనది. కనుకనే తన తర్వాతి తరం చిత్రకారులకి స్ఫూర్తిగా నిలిచారు గియాట్టో.

అంతర్లోకాల ఆవిష్కరణ

తెలుగువారికి తొలుత సర్రియలిజం (అధివాస్తవికవాదం) పరిచయం చేసినవారు శ్రీశ్రీ, త్రిపుర. దీని మూలాలు సాహిత్యంలో, చిత్రకళలో ఎలా వున్నాయో చెప్పాలంటే ఒక ఉద్గ్రంథమే రాయాలి. చిత్రకళకు సంబంధించి వస్తే సర్రియలిస్ట్ పెయింటింగ్స్‌కు పెట్టింది పేరు సాల్వడార్ డాలీ. స్పెయిన్‌లో 04 మే 1904లో జన్మించి 23 జనవరి 1989 వరకు జీవించారు. జీవితాన్ని పరిపూర్ణంగా గడిపిన సృజనశీలి. చిత్రకళలో అతను చేసిన ప్రయోగాలు అపూర్వం. సర్రియలిజానికి ఆదిగురువుగా చెబుతారాయన్ని. వ్యవస్థీకృత విలువల్ని ప్రశ్నించారు. మానవ ఉద్వేగాల్ని, అంతశ్చేతనలోని వైరుధ్యాల్ని తన చిత్రాల్లో ప్రతిఫలింపజేశారు. మానవుని ఊహాశాలితకు ఎలాంటి పరిమితులు, పరిధులులేవు, దాని అభివ్యక్తికి మాత్రం పరిమితులు విధించడం ఏమిటన్నది డాలీ ప్రశ్న. కనుక నియమాల్ని, విలువల్ని ధిక్కరిస్తూ తనదైన శైలిలో చిత్రకళారంగంలో విహరించారు. సర్రియలిజం ద్వారా తలకిందులుగా వున్న ప్రపంచాన్ని, మనుషుల ధోరణిని చూపారు. నిజాల్ని చూసే అలవాటు లేని ప్రపంచం అప్పుడు ఇప్పుడు కూడా డాలీ చిత్రాల్ని చూసి విస్తుపోతోంది. మనిషి అంతర్లోకాల అలజడినీ, విశృంఖలత్వాన్ని, దారితప్పిన కలల కలవరాన్ని డాలీ చిత్రాలు దర్శింపజేస్తాయి. మానవ స్వభావాన్ని, మనస్తత్వంలోని వైరుధ్యాల్ని ఆవిష్కరించారు. వాస్తవాన్ని నర్మగర్భితమైన రీతిలో చెప్పడమే కాదు. ఒక వాస్తవంలోని అసలు అంతరువులు, సారాంశంలోని భిన్నరూపాలు ఎలా వుంటాయో డాలీ చిత్రాలు చెప్పకనే చెబుతాయి. ఈరకమైన భావసారూప్యత శ్రీశ్రీ, త్రిపుర రచనల్లో చూడొచ్చు. ఈ ఇద్దరికీ ఇష్టుడైన డాలీని తెలుగు సాహిత్య కళా రంగాల్లో ఎందరో ప్రేమిస్తారు. కవిత్వంలో, కథల్లో ప్రస్తావించారు. తెలుగునాట సృజనకారుల మీద డాలీ ప్రభావం గురించి ఒక పుస్తకమే రాయొచ్చు. అలాంటి డాలీ చిత్రాలు కొన్ని ఇక్కడ చూడండి.

■ అంతరంగం

ఊహాచిత్రం

కలలు, కోర్కెలు, ఆశలు అందరికీ ఉంటాయి. కాని వాటిని సాకారం చేసుకోవాలన్న తపన కొందరిలోనే ఉంటుంది. తపనతోపాటు పట్టుదలగా కృషి చేసే వారు చాలా అరుదు. ఒక పనిని తలపెట్టి, అది పూర్తయ్యేవరకు అవిరామంగా శ్రమించేవారు ఈ కోవలోకి వస్తారు. ఈరకమైన దృష్టికోణం మనుషుల్ని తాము ఎంచుకున్న లక్ష్యాల దరి చేరుస్తుంది. అందుకని తమ పనుల్ని, వాటిని సాధించుకునే మార్గాల్ని, సాకారమయ్యేప్పుడు ఉండే ఫలితాల్ని ముందే ఊహించగలగాలి. వీటన్నిటికి సంబంధించిన ఒక ఊహాచిత్రం మనసులో రూపుదిద్దుకోవాలి. ఒకపనిలో దీక్షాదక్షతలు ప్రతిఫలించాలంటే అందుకు సంబంధించిన ఊహాపరికల్పన సక్రమంగా వుండాలి. "ఒక వ్యాపారాన్ని విజయవంతంగా నిర్వహించాలంటే మనిషికి భావనాశక్తి అవసరం. దానికి సంబంధించిన స్వప్నాన్ని దర్శించగలగాలి" అంటారు చార్లెస్ ఎం.స్వాబ్ అనే పెద్దమనిషి. ఇక్కడ వ్యాపారమనే కాదు, ఏ పని అయినా కావచ్చు. ఆ పని సరిగ్గా చేయడానికి కావలసిన సకల అంశాల్ని ముందుగానే ఊహించాలి. తాను చేసే ఒక్కొక్కపని ఎలాంటి ఫలితాలకు దారితీస్తుందో దర్శించగలగాలి. ఇలాంటి ఊహాశాలిత మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేస్తుంది.

తమ కోర్కెలు, ఆశలు ఈడేరాలంటే ప్రతిఒక్కరికి సానుకూలమైన ఊహాశక్తి తప్పనిసరి. ఒక పని చేపట్టాక ఫలితం ఏమవుతుందనే సంశయాలు ఉండకూడదు. పనిలో వందశాతం ప్రయత్నం పరిపూర్ణంగా ఉండాలే తప్ప ప్రతికూల ఫలితాలు వస్తాయని సందేహించకూడదు. సంశయిస్తూ పని మొదలెట్టడం ఎంతమాత్రం భావ్యం కాదు. అందుకని చేపట్టిన పనులు అన్నీ ఎలాంటి అంతరాయాలు లేకుండా నెరవేరుతాయని అర్థం కాదు. అన్నీ అనుకున్నట్టే జరగాలనేం లేదు. ఎలాంటి అంతరాయాలు, అడ్డంకులు ఎదురయ్యే అవకాశం వున్నదో కూడ ఊహించి, వాటిని అధిగమించే మార్గాలకు సంబంధించిన అంచనాలు మనసులో ఒక పక్కన ఉండాలి. అయితే ఊహించని అడ్డంకులూ రావచ్చు. వాటిని అధిగమించి ముందుకు పోవడమెలా అన్నది కార్యసాధకులు ఆలోచిస్తారు. అంతరాయాల్ని సాకుగా చూపి పనుల్ని, లక్ష్యాల్ని మధ్యలోనే వదిలేస్తారు కొందరు. ఎందుకంటే వారి విజయం పట్ల, పనుల సాఫల్యం పట్ల వారికే సానుకూల దృష్టి ఉండదు. అయాచితంగా విజయాలు వస్తే స్వీకరిస్తారు. కానీ తమంతట తాము విజయం కోసం దీక్షతో శ్రమించరు. కొందరు మాత్రం ఏ పని అయినా, లక్ష్యమైనా నెరవేరాలన్న బలీయమైన ఆకాంక్షతో కృషి చేస్తారు. చేపట్టిన పనుల సాఫల్యత గురించి ఆలోచిస్తారు. తగిన వ్యూహాలు రూపొందించుకొని అమలు చేస్తారు. ఈవిధంగా సానుకూల దృష్టిని ప్రోది చేసుకునేవారు ఏ రంగంలో వున్నా రాణిస్తారు. విజయాలకు సంబంధించిన ఊహాచిత్రం ఇందుకు ఉపకరిస్తుంది.

వెంటాడే వాక్యం

ఎగుడుదిగుడు మార్గాల్లో కిందపడి, మీదపడి, ఎదురుదెబ్బలకు వెరవకుండా సహనంతో ప్రయాణం చేసినవారే ఉన్నతస్థాయికి చేరుకుంటారు.

– థామస్ అల్వా ఎడిసన్

ప్రజాశక్తి సోపతి

అక్టోబర్ 12, 2014

లేఖలు 4

చిట్కాలు

మొదటిసారి కలిసి చూసిన సినిమా 5

కవర్‌స్టోరీ

నియంత్రణే నివారణ మార్గం 6

స్ఫూర్తినిచ్చిన గురువు 9

కథ నడక ముచ్చట్లు 10

అలనాటి రచనలు

సంగీతం నోరూరించే స్వరాల విందు 13

నెమలీక 14

సీరియల్ ప్రేమ - విప్లవం 16

స్కెచ్ మళ్ళీ కందిలీ ముట్టిద్దాం! 18

నా పాట

తరాలు మారినా చెదరదు మా యువతరం 19

సృజన గరాజ్జీ డెలెడ్డా 20

నవరాగం

ఇష్టాల్ని గమనిస్తున్నారా? 22

సోర్స్‌కోడ్ క్లౌడ్ టెక్నాలజీదే భవిష్యత్తు 23

సమీక్షలు

ప్రజావైద్యుడు డాక్టర్ సత్యపాల్‌తులి 24

ఈ వారం కవిత్వం

బలమైనది మన స్నేహ వారధి 26



అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అనుసరించడమే అధిక రక్తపోటు నియంత్రణకు మార్గమని చెబుతున్న ముఖచిత్ర కథనమిది

లేఖలు

వెండి వెలుగులు బాగున్నాయి

ఆదివారం సోపతి సంచికలో కవర్‌స్టోరీ 'వెండి వెలుగుల జీవన చిత్రాలు' కథనం బాగుంది. ఇది చదివిన తర్వాత సమాజంలో ఒక వెలుగు వెలిగిన మహానుభావుల జీవిత చరిత్రలను తెరకెక్కించి, వారి యదార్ధగాథలను ప్రేక్షకులు తనివితీరా చూసేలా సినిమాలు తీస్తున్న దర్శక, నిర్మాతలకు హాట్సాఫ్. బాగ్ మిల్కా బాగ్ చిత్రం సంచలనం సాధించడంతో హిందీ చలన చిత్ర పరిశ్రమ ఉర్రూతలూగింది. ఎన్నో సందేశాత్మక చిత్రాలను నిర్మిస్తూ, మిగతా భాషల దర్శక, నిర్మాతలకు ఆదర్శంగా నిలుస్తుంది.

– కామిడి సతీష్ రెడ్డి, పరకాల, వరంగల్ జిల్లా

జీవితం విలువ తెలియజేశారు

అంతరంగం చాలా బాగుంది. శారీరక శ్రమనే వృథా అన్నట్లుగా వ్యవహరిస్తున్న నేటి ఆధునిక ప్రపంచానికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంది. మానవ సంబంధాలు కేవలం ఆర్థిక సంబంధాలుగానే కాకుండా సామాజిక సంబంధాలుగా చూసిన నాడే మానవుడు మనగలుగుతాడనే జీవిత సత్యాన్ని వివరించిన సోపతికి ధన్యవాదాలు.

– రాము, వరంగల్

పూర్తి పాటను ఇవ్వాలి

పిల్లలకు సంబంధించిన పాటలను చక్కగా క్రోడీకరించారు. అలనాటి పాటల నుండి నేటి తరం పాటల వరకు ఇచ్చిన ఈ సంగీత విభాగం ఎంతో బాగుంటుంది. ఇలాంటి ప్రత్యేక పాటల్లో పాపులర్ ఒక పాటను పూర్తిగా ఇస్తే ఇంకా బాగుంటుంది.

– దివ్య, కొణిజర్ల, ఖమ్మం జిల్లా

ప్రేమే విప్లవం

కారల్ మార్క్స్ జీవిత చరిత్రను తెలుసుకోవలసిన అవసరం ఈ జనరేషన్‌కు ఉంది. మార్క్స్ సిద్ధాంతానికి కాలం చెల్లింది అన్నవారే ఇప్పుడు మార్క్స్ పెట్టుబడిని చదవడానికి ఉత్సాహాన్ని చూపుతున్నారు. అలాంటి సమయంలో మార్క్స్ జీవిత చరిత్రను తెలుగులో అనువదించి సీరియల్‌గా ప్రచురిస్తున్న సోపతికి ధన్యవాదాలు

– శాంతి, ఎస్.ఆర్ నగర్, హైదరాబాద్

మళ్లీ రావాలి

ఆదివారం సోపతిలో 'అలుపెరగని పోరుగీతం' అంటూ బల్లా రత్నం ఆట పాటల గురించి వివరించారు. ప్రాంతీయ బేధం లేకుండా ఆయన బుర్రకథ చెప్పడంలో ఆయన ప్రతిభ అపారం. ఈ బుర్రకథ అంటే నేటి పిల్లలకు అస్సలు తెలీదు. మర్చిపోయిన కళల్లో ఒకటిగా ఈ బుర్రకథను పునరుద్ధరించాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 'సోర్స్‌కోడ్'లో సెల్ఫీలు షేర్ చేస్తున్నారా..? కథనం ఆసక్తిగా ఉంది. అందులో ఇచ్చిన జాగ్రత్తలు ఉపయోగంగా ఉన్నాయి.

– శంకర్ నాయక్, వెంకటాపురం, రంగారెడ్డిజిల్లా

వెండి వెలుగులు పంచినట్లుంది

వెండి వెలుగుల జీవన చిత్రాలు శీర్షికన ఆదివారం సోపతిలో ఇచ్చిన కథనం ఆద్యంతం ఆకట్టుకుంది. ఇంగ్లీష్, హిందీ చిత్ర పరిశ్రమలు ప్రయోగాలు చేయడానికి ముందుంటాయి. కానీ తెలుగులో నిర్మాతల దగ్గర్నుండి హీరోల వరకు ఎవ్వరూ అలాంటి సాహసానికి పూనుకోరు. అసలు ఆ ఆలోచనే దరికి రానివ్వరు. తెలుగు వాళ్లు కూడా ఆ సినిమాలను ఎంతో ఆసక్తితో చూస్తున్నప్పుడు, మనవాళ్లు తీసిన ప్రయోగాత్మక తెలుగు సినిమాలు ఎందుకు ఆదరించరో అర్థం కాదు. ఇక ముందైనా ప్రయోగాత్మక చిత్రాలు తెలుగులో కూడా రావాలని ఆసిద్దాం. అవి విజయవంతమవ్వాలని కోరుకుందాం.

– రవళి, హైదరాబాద్

మన జాతీయాలు

అల్లం దిన్న కాకి

కాకి మాంసమని భ్రమించి నూరిన అల్లం ముద్దను గబుక్కున మింగింది. అల్లంకారం భరించరానిదిగా ఉంటుంది. కారం ఘాటుకు కావ్ కావ్‌మని అరుస్తుంది కాకి. విందు భోజనాల్లో అందరికి సరిపోవాలని మాంసం కూరల్లో లవంగాలు, మిరియాలు, అల్లం, యాలకులు, ఎల్లిపాయలు, మిరపపొడి హెచ్చు మోతాదులో వేస్తారు. భోజనానంతరం కారం అలవాటు లేని వారు, చిన్నపిల్లలు హా! హా!! అని హాహాకారాలు చేస్తూ ఒక్కొక్కరు మంటకు తట్టుకోలేక ఏడుస్తారు. "ఈ పోరగాండ్లు అల్లందిన్న కాకితీరు ఏడుస్తున్నారు కొద్దిగా బెల్లం పెట్టు తియ్యవడ్తది" అనటంలో ఈ జాతీయం వాడకం చూడొచ్చు.

పోంగ చిక్కినోడు

వైద్య సౌకర్యాలు లేనినాడు అంటువ్యాధులు ప్రబలితే చిన్న చిన్న పల్లెల్లో సగం నుంచి మూడు పాళ్ళవరకు ప్రజలు చనిపోయేవారు. చచ్చినవారు చావంగ మిగిలినవారు పొరుగు గ్రామానికో, తన దాయాదుల దగ్గరికో బతికితే చాలనుకొని వెళ్ళిపోయేవారు. చనిపోయినవారు, తరలిపోనీవారు పోగా మొండికేసిన వాడొకడు పోంగ చిక్కినవాడు. వీడు పాడుబడ్డ గ్రామానికి పెద్ద. సాహసించి వున్నదానికి ఆ గ్రామమంతా వానిదే. 'పోంగ చిక్కినవాడు పొలిమేరకు పెద్ద' అని ఒక సామెత. వీడు చాలా ఘటికుడు. మొండివాడు. ఎవరికీ తలవంచడు. ఎంతటి ఆపదనైనా ఎదుర్కొనేవాడు. "అబ్బో వాన్ని తక్కువగా అంచనా వేయొద్దు. పోంగ చిక్కినోడు, దేనికైనా తెగిస్తాడు" అనటంలో ఈ జాతీయం వాడకం వుంది.

చూసి రమ్మంటే గుడినలుముకొన్నట్లు

వేములవాడ భీమేశ్వరుని సందర్భంగా స్థానికంగా ప్రచలితమైన ఐతిహ్యం ఇది. భీమన్నను గుడి ఎంతవరకు వచ్చిందో చూసిరమ్మంటే ఆ గుడిలోనే ఉండిపోయాడట. వండుమంటే కుండకు దొర అయినాడనుటకు సరితూగే జాతీయం. ఎవరికయినా ఒక పని పర్యవేక్షణ బాధ్యతలని అప్పగిస్తే ఏకంగా ఆ పని తన సొంతం చేసుకోవటమని భావం.

– వేముల పెరుమాళ్ళు

■ చిట్కాలు

పాటించాల్సిన సూత్రాలు

★ ఫోను ఎల్లప్పుడూ ఎడమచేత్తోనే పట్టుకొని ఎడమవైపు చెవి దగ్గర పెట్టుకొని మాట్లాడాలి.
★ బ్యాటరీ ఆఖరి పాయింట్లలో ఉన్నప్పుడు మొబైల్ మాట్లాడకూడదు. ఎందుకంటే వెయ్యి రెట్ల అధిక రేడియేషన్ విడుదలవుతుంది.
★ చల్లని నీటితో మందులు (మెడిసిన్స్) వేసుకోకూడదు.
★ సోడా నీళ్ళతో కూడా మందు బిళ్ళలు (మెడిసిన్స్) మింగకూడదు.
★ సాయంత్రం అయిదు గంటలు దాటాక ఎక్కువ ఆహారం తీసుకోకూడదు.
★ రోజూ మీ ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు భాగమై ఉండేలా చూసుకోండి.
★ మంచినీళ్ళు పగటిపూట ఎక్కువగా, రాత్రిపూట తక్కువగా తాగాలి.
★ రాత్రి పది నుంచి తెల్లవారుజాము నాలుగు గంటలవరకు నిద్రించడం

బ్లాక్ అండ్ వైట్ ఫొటోలున్నాయా?

ఎక్కడ చూసినా పంచరంగుల ఫొటోలే కనిపిస్తున్నాయి. ఫొటోల కన్నా వీడియోల హల్‌చల్ పెరిగింది. కానీ బ్లాక్ అండ్ వైట్‌లో ఉండే అందమే వేరు. అలనాటి సావిత్రి, జమున, నూతన్, మీనాకుమారి, ఎన్టీఆర్, హరనాథ్, శోభన్‌బాబు, గురుదత్ వంటి వారి బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు చూస్తే ఆ అందమే వేరు. అలాగే మీ చిన్ననాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు చూడండి ఎంత చూడముచ్చటగా వుంటాయో. అందుకని పిల్లల్ని, కౌమరంలో, తొలియవ్వన ప్రాయంలో వున్నవారి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు కూడా తీయండి. కలర్ ఫొటోలు ఎలాగో ఉంటాయి. కానీ కొన్నయినా బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు తీసి దాచుకోవాలి. సిడిల్లో, కంప్యూటర్లలో దాచిపెట్టడం కాదు. బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు కొన్ని ప్రింట్స్ వేసి దాచి పెట్టుకోండి. ఆ అనుభూతి ఒకింత వింత. మరొకింత మాటల్లో చెప్పలేని అనుభూతి.

జీవితమంటే గడిచిపోయే జ్ఞాపకాల సమాహారమే అన్నాడో పెద్దమనిషి. జ్ఞాపకాలు కొన్ని మధురంగా ఉంటాయి. మరికొన్ని విషాదానికిలోను చేస్తాయి. కొన్ని సరదాగానూ, ఆహ్లాదంగానూ ఉంటాయి. అలాంటి జ్ఞాపకాల జాబితా ఒకటి మీ పర్సనల్ నోట్‌బుక్‌లో రాసుకోండి.

★ మీరు, మీ జీవన భాగస్వామి కలిసి చూసిన తొలి సినిమా ఏదో గుర్తు తెచ్చుకోండి. దాన్ని నోట్ చేయండి.
★ అలాగే మొదటిసారి మీరు వెళ్ళిన రెస్టారెంట్
★ తొలిసారి కలిసి చదివిన పుస్తకం
★ కలిసి విన్న పాట
★ ఇద్దరూ కలసి పర్యటించిన ప్రదేశం అంటే పర్యాటక స్థలం...

మొదటిసారి కలిసి చూసిన సినిమా...?

★ మొదటిసారి కలిసి బస్సులో ప్రయాణించింది ఎప్పుడు?
★ ఇద్దరూ కలిసి మొట్టమొదటిసారి రైలు ప్రయాణం చేసిందెప్పుడు?
★ ఇద్దరూ కలిసి విమానం ఎక్కారా? తొలి విమాన ప్రయాణం తేదీ గుర్తుందా?
★ అసలు మీ జీవితకాలంలో మీరు ఎన్నిసార్లు కలిసి పర్యటించారు? ఏయే ఊళ్ళు తిరిగారు? అదొక జాబితా తయారు చేయండి.
★ తొలినాళ్ళలో ఫొటోస్టూడియోకు వెళ్ళి కలిసి దిగిన ఫొటో... గుర్తుందా? అయితే మరీ రాయండి ఎక్కడ, ఎప్పుడు, ఏ సందర్భంలో.

ఒక ఏకాంత సమయాన ఇలా జ్ఞాపకాల్ని నోట్‌బుక్‌లో రాసి పెట్టుకోండి. రాసే సమయంలో ఆ తొలినాళ్ళ మధురిమలు మీ మనసును ఆహ్లాదపరుస్తాయి. కొందరికి "ఆ రోజులు ఏమైపోయాయి" అనే ఒకింత నిర్వేదానికి లోను చేయవచ్చు. కానీ ఇలా తలచుకోడానికి హరివిల్లులల్లాంటి కొన్నిరోజులయినా ఉన్నాయి కదా అని సర్ది చెప్పుకోండి.



■ కవర్ స్టోరీ

నియంత్రణే నివారణ మార్గం

కంప్యూటర్ ముందు కూర్చుని వెబ్‌సైట్‌కు వార్తల్ని అప్‌లోడ్ చేస్తున్న ప్రకాష్ వున్నట్టుండి పడిపోయాడు. చుట్టూ వున్న సిబ్బంది గాబరాపడి దగ్గరలో వున్న ఆసుపత్రికి తీసుకెళ్ళారు. డాక్టర్ బి.పి. చెక్ చేశాడు. అధిక రక్తపోటు కారణంగా కళ్ళు తిరిగి పడిపోయాడు. ప్రాథమిక చికిత్స తర్వాత కొన్ని టాబ్లెట్స్ ఇచ్చాడు. వారం రోజులు వరుసగా బి.పి. చెక్ చేశాక బి.పి. టాబ్లెట్స్ రెగ్యులర్‌గా వాడాలో లేదో చెబుతామన్నారు.

“బి.పి. ఎంత వుంది” ప్రకాష్‌తోపాటు వచ్చిన మిత్రుడు అడిగాడు.

“160-100”

“నార్మల్‌గా ఎంత వుండాలి”

“120-80”

బి.పి.లో అధిక రక్తపోటు (హై బి.పి.) తక్కువ రక్తపోటు (లో బి.పి.). ఉంటాయి.

సాధారణంగా ఉండాల్సిన రక్తపోటుకు సంబంధించిన విషయాల్లో చాలామందికి పొరపాటు అభిప్రాయాలున్నాయి. అధిక రక్తపోటు మరింత ప్రమాదమని, లోబిపి సమస్యేం కాదని అనుకుంటారు. ఇది అవగాహనా రాహిత్యం.

బి.పి. లెవల్స్ అనుకోకుండా దారుణంగా పడిపోతే మనిషి ప్రాణాలకే ప్రమాదం. హై బి.పి.ని ఒక దశలో గుర్తిస్తే చికిత్స ఆరంభించడం సులువు. హై బి.పి.లో జాగ్రత్తలు తీసుకోకపోతే ఇతరేతర జబ్బులకు దారితీస్తుంది. అందుకని సాధారణ స్థాయి కన్నా బి.పి.ఎక్కువ తక్కువలు ఉండటం ఆరోగ్యకరం కాదు.

సాధారణ స్థాయి

సాధారణంగా ఉండాల్సిన రక్తపోటు 120-80. దీన్నించి ఎటు మొగ్గినా అది ఆరోగ్యకరం కాదు. సాధారణ స్థాయిలో ఉండేలా జాగ్రత్త పడటం తప్పనిసరి. ఒక వ్యక్తి రక్తపుపోటు 120-80 మి.మీ. మెర్క్యురీ అని వైద్యులు చెబితే 120 అనేది ‘సిస్టాలిక్’ అంటే గుండె సంకోచించినప్పుడు కనిపించే ఒత్తిడి అయితే 80 అనేది ‘డయస్టాలిక్’ అంటే గుండె వ్యాకోచించినప్పుడు కనిపించే ఒత్తిడి అని అర్థం. ఈ 120-80 అన్నది సాధారణ స్థాయిలో ఉండాల్సిన రక్తపు పోటు. ఇది ఆరోగ్యకరమైన మనిషిలో ఉండాల్సిన బి.పి.స్థాయి. దీనిలో హెచ్చు తగ్గులే బి.పి. సమస్యలకు మూలం.

ఆధునిక జీవితం సంక్లిష్టం. ఒకప్పుడు 40, 50 ఏళ్ళు దాటాకనే బి.పి.సమస్యలు వచ్చేవి. ఇప్పుడు చాలామందికి అనేక కారణాల వల్ల అధిక రక్తపోటు సమస్యలు వస్తున్నాయి. తీసుకునే అసమతుల్య ఆహారం, ఒత్తిడికి లోనవడం, బతుకులో ప్రశాంతత కొరవడటం... నిత్యం పరుగులు తీయడం... తప్ప నింపాదిగా, నిదానంగా, స్థిమితంగా ఉండే వారు అరుదయ్యారు. ఈ కారణంగా మునుపెన్నడూ లేని రీతిలో చాలామంది అధిక రక్తపోటు సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సమస్య తర్వాతి కాలంలో డయాబెటీస్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులకీ దారి తీస్తోంది. దీని గురించి ఎంత ప్రచారం చేసినా, ఎన్ని పత్రికలలో రాసినా

మన దగ్గర హై బి.పి.తో అవస్థ పడే వారి సంఖ్య పెరుగుతూనే వుంది.

ప్రపంచవ్యాప్తంగా వందకోట్ల మందికి పైగా అధిక రక్తపోటు వ్యాధితో బాధపడుతున్నారు. ఏటా 89 లక్షలమంది మరణాలు అధిక రక్తపోటుకు సంబంధించిన వ్యాధులతో సంభవిస్తున్నాయి. ఒక అంచనా ప్రకారం ప్రతి వంద మందిలో 30 నుంచి 35 మంది ఈ జబ్బుతో అవస్థ పడుతున్నారు. ఈ లెక్కన మనదేశంలో దాదాపు 30 నుంచి 35 కోట్ల మంది హై బి.పి. వ్యాధిగ్రస్థులున్నారు.

జీవనశైలిలో అపసవ్యతలు

ఆయుర్వేద వైద్యవిధానం ప్రకారం ఏ సమయానికి చేయాల్సిన పని ఆ సమయానికి చేస్తూ ప్రశాంతంగా బతకడానికి ప్రయత్నిస్తే రక్తపోటు సాధారణ స్థాయిలో ఉంటుంది. ఏ చీకూ చింతా లేకుండా ఉండడం సాధ్యం కాదు గానీ వీలయినంత మటుకు నిబ్బరంగా ఉండడానికి ప్రయత్నించాలి. జీవనశైలిలో క్రమశిక్షణ పాటించాలి.

మనిషి కష్టించే తత్వాన్ని కోల్పోవడమే అనేకరకాల రుగ్మతలకు మూలం. తెల్లవారుజామునే నిద్రలేవడం... నడవడం మంచి అలవాటు. వైట్ కాలర్ ఉద్యోగాలు చేస్తున్నవారు మరిం సుకుమారంగా తయారవుతన్నారు. చెమట చిందించకుండానే రోజులు గడిపేస్తున్నారు. శరీరాన్ని అతి సుఖానికి అలవాటు చేస్తున్నారు. ఇది బద్ధకానికి దారితీయడమే కాదు, ఊహించని రీతిలో బరువు పెరగడానికి కారణమవుతుంది. అధిక బరువు, స్థూలకాయం సమస్యలుగా మారాయి. ఈ కోవకు చెందిన మనుషులు 30-40 ఏళ్ళకే బి.పి.తో బాధపడుతున్నారు.

కొందరు ఆలస్యంగా నిద్రలేస్తారు. ఆలస్యంగా పడుకుంటారు. సెలవురోజుల్లో గంటల తరబడి మంచం మీదే వుండిపోతారు. ఆహార పానీయాల్ని ఆబగా లాగిస్తారు. రెండు మైళ్ళ దూరం కూడా నడవకుండానే వారమంతా గడిచిపోతుంది. ఇలాంటి జీవనశైలి ఎంతకాలం సాగుతుంది? శరీరం చెప్పినట్టు వినకపోతే, తను చెప్పినట్టు వినకతప్పని స్థితిని శరీరం కల్పిస్తుంది. హై బి.పి. సమస్య వచ్చాక గానీ జాగ్రత్తపడటానికి ప్రయత్నించరు. మొదటే జాగ్రత్త పడటం శ్రేయస్కరం.

వ్యాయామం తప్పనిసరి

మనిషికి ఏదో రకమైన వ్యాయామం ఉండాలి. పొద్దుటే లేచి నడిచే అలవాటు చేసుకోవాలి. ఇంట్లో కనీసం అరగంట యోగా, 15 నిమిషాలు

ధ్యానం చేయాలి. రోజులో ఒక గంట దేహం కోసం కేటాయిస్తే మిగతా 23 గంటలు దేహం మీ అదుపులో ఉంటుంది. ఈ జాగ్రత్త పాటించడం మంచిది. చెమట పట్టేవరకు నడవాలి. వేగంగా నడిస్తే చెమట చిందించకుండా ఉండగలమా? ప్రయత్నించి చూడండి.

ఆరాటం వద్దు

ఆధునిక జీవితం మనుషుల్ని ఒత్తిడికి లోను చేస్తుంది. ఒక పని జరగకపోతే ఏదో ఉపద్రవం ముంచుకొస్తుందన్న భయంతో ఆరాటపడతారు. అనుకున్నట్టు జరుగుతుందా లేదా అని తీవ్రంగా ఆరాటపడుతూ తల్లడిల్లుతారు. ఈ క్రమంలో మెదడు మాత్రం తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. ఇది కూడా రక్తప్రవాహశీలతను ప్రభావితం చేస్తుంది. కనుక అధికంగా ఉద్వేగాలకు లోనవకుండా ఉండేందుకు ప్రయత్నించాలని ఆయుర్వేదం చెబుతుంది. వాతదోషం కారణంగా హై బి.పి.సమస్యలు వస్తాయి.

ఆహార పానీయాలు తీసుకోవడంలోనూ, విసర్జక క్రియలోనూ ఆటంకాలు రాకుండా ఉండాలి. ప్రాణాయామం చేయాలి. పిత్త, వాత అనే అంశాల కోణంలోంచి చూసినప్పుడు ఒక మనిషిలో అధిక రక్తపోటుకు గల కారణాలు తెలుస్తాయి. దీనిని అనుసరించే ఆయుర్వేద వైద్యవిధానంలో చికిత్సను అందించడం సులువు.

ఆరంభంలో ఒకటీ రెండుసార్లు చెక్ చేసినపుడు అధిక రక్తపోటు కనిపించినంత మాత్రానే అధిక బి.పి. ఉన్న మనిషిగా పరిగణించకూడదు. తిరిగి సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉన్నదో లేదో పరిశీలించాలి. ఇది ప్రాథమిక దశలోనే ఆయుర్వేద వైద్యుల వద్ద చెకప్‌కు వస్తే ఎలాంటి చికిత్స సాధ్యమో పరిశీలించే వీలుంటుంది. ఒకసారి హై బి.పి. వ్యాధి వచ్చిందని నిర్ధారితమైతే మందులు వాడటంమ తప్పనిసరి. నిరంతరం దానిని అదుపులో ఉంచుకునేలా జాగ్రత్తపడటం అవసరం.

వంశ పారంపర్యంగానూ, ఆహారపానీయాలు తీసుకోవడంలో అపసవ్యతలు, అతిగా ఆరాటం, నిరాశానిస్పృలు, ఒత్తిడి, ఆందోళన వంటి అంశాలు హైబి.పి.కి దారితీస్తాయి. ఒకసారి అధిక రక్తపోటు వచ్చిందని తెలిసాక, మరింత జాగ్రత్తగా ఉండాలి. లేనట్టయితే ఇతరేతర జబ్బులతో కునారిల్లవలసి వస్తుంది. అందుకని ఈ విషయంలో మెలకువగా ఉండాలి.

ఆయుర్వేదం ప్రకారం ఆహారంలో మార్పులు

అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచాలంటే ఆహారం తీసుకోవడంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రలోభాలకు లోనవకూడదు. జిహ్వాచాపల్యం విడనాడాలి.

ఆయుర్వేద సూత్రాల ప్రకారం ఎలాంటి ఆహారం తీసుకోవాలో, ఏవి

తీసుకోకూడదో గుర్తించి పాటించడం ప్రధానం.

➡ అన్నిరకాల మాంసం, గుడ్లు, ఉప్పు పూర్తిగా మానేయాలి.

➡ ప్రొటీన్ అధికంగా ఉండే వస్తువులు ఆహారంగా తీసుకోవడం తగ్గించాలి.

➡ నిమ్మరసం తీసుకోవడం మంచిది. ప్రతిరోజు ఉదయం నిమ్మరసం, నిమ్మ కలిపిన నీళ్ళు తాగాలి. ద్రాక్ష పండ్లు మంచివి.

➡ కాఫీ, టీలు మానేయాలి. వీటిలో ఉండే కేఫిన్ ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదు.

➡ హై బి.పి. వున్న ప్రతి ఒక్కరికి ఉప్పు తగ్గించమని డాక్టర్లు సాధారణంగా ఇచ్చే సలహా. దీనిని తప్పక పాటించాలి. వీలయితే ఉప్పు లేకుండా కూరలు, ఉప్మాలు చేసుకోవాలి. మజ్జిగన్నంలో, మజ్జిగలో ఉప్పు వేసుకోకుండా ఉండాలి.

➡ మద్యం మానేయడం మొదట చేయాల్సిన పని. అలాగే స్మోకింగ్ తగదు. వీటికి స్వస్తి చెప్పడం ఆరోగ్యకరమైన జీవనానికి అవసరం.

ఈ అలవాట్లు మానకుండా అధిక రక్తపోటు నియంత్రణలో ఉండదు. అందువల్ల అలవాట్లలో మార్పు కనిపించాలి. కొంతమంది ఇతరుల కోసం తప్పదన్నట్టుగా మందు పుచ్చుకుంటారు. సిగిరెట్లు కాలుస్తారు. అతిగా చికెన్, మటన్ బిర్యానీలు తీసుకుంటారు. వీటన్నిటి కారణంగా అధిక రక్తపోటు అనే సమస్య మరింత పెరుగుతుంది. కనుక ఈరకమైన ఆహారం మీకు తగదని గుర్తించండి.

హై బి.పి. ఉన్నా లేకపోయినా ఈరకమైన ఆహారపు విధానాలు దీర్ఘకాలిక దృష్టితో చూసినప్పుడు అనుసరించదగినవి కాదు. ఆరోగ్యంగా జీవించే వారు ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు అలవరుచుకోవాలి.

అవసరం లేనివి తీసుకోడమే అసలు సమస్య

వందేళ్ళ కిందట కాఫీ, టీలు తాగే అలవాటు లేదు మనవాళ్ళకు. ఇప్పుడు వాటిని తాగడం కోసమే పుట్టామన్నట్టుగా వుంది మనుషుల వ్యవహార సరళి. అలాగే ఒకనాటి రోజుల్లో ఉప్పు వాడకం కూడా తక్కువ. వంటల్లో మసాలాలు కూడా తక్కువగా వాడేవారు. ఇందుకు విరుద్ధమైన అలవాట్లు వ్యాప్తిలో వున్నాయి. అవసరం లేకున్నా తినడం, తాగడం పెరిగింది. ఈ కారణంగా బరువు పెరుగుతున్నారు. రక్తనాళాల మీద



ఒత్తిడి పెరుగుతుంది. ఇది అధిక రక్తపోటుకు దారి తీస్తోంది. అందుకని అనవసరమైన ఆహారానికి దూరంగా ఉండటం తొలుత చేయాల్సిన పని.

ఆయుర్వేదిక్ జీవనశైలి

అధిక రక్తపోటు సమస్య వున్నవారుగానీ, ఈ సమస్య లేనివారు గానీ జాగ్రత్తగా ఉండాలంటే ఆయుర్వేదిక్ జీవనశైలిని అనుసరించాలి. ఇది రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా జీవించడానికి ఉపకరిస్తుంది. అందుకని ఆయుర్వేదం ప్రకారం జీవిత గమనాన్ని మార్చుకోవాలి.

➡ మానసిక, శారీరక పరమైన ఒత్తిళ్ళకు దూరంగా ఉండాలి. శారీరకపరంగా జాగ్రత్తలు తీసుకోవడమంటే సమతుల ఆహారం తీసుకోవాలి. పొద్దుటే వ్యాయామం చేయాలి. కాస్సేపు యోగా, ప్రాణాయామం తప్పనిసరిగా మీ ఉదయపు జీవనంలో భాగం కావాలి. పొద్దుటిపూట యోగా, ధ్యానం, ప్రాణాయామం చేయకుండా బయటికి వెళ్ళకూడదు. పొద్దుట అయిదు గంటల లోపు నిద్ర లేవాలి. రాత్రి తొమ్మిది-పది గంటల మధ్యన మీ దినచర్యను పూర్తి చేసుకొని నిద్రకు ఉపక్రమించాలి.

అందువల్ల ఉదయం పూట లేవగానే గంట, గంటన్నర సేపు వ్యాయామం మీ జీవనశైలిలో తప్పనిసరి వ్యాపకంగా ఉండాలి.

ఇక ఆహారం సమపాళ్ళలో తీసుకోవాలి. అప్పుడు దేహంలో కొవ్వుశాతం పెరగదు. కొలెస్ట్రాల్ తగినస్థాయిలో ఉంటుంది. బరువు పెరగరు. శరీరం తేలికగా ఉంటుంది. శరీరంపై ఒత్తిడి ఉండదు.

ఇక మానసిక ఆరోగ్యం చేకూరి ఒత్తిళ్ళకు దూరంగా ఉండాలంటే సత్యమే పలకాలి. నిజాలు మాట్లాడటం అలవాటు చేసుకోవాలి. అబద్ధం ఒత్తిడికి లోను చేస్తుంది. ఆందోళనలతో వ్యాకులత ఏర్పడుతుంది. తప్పు చేస్తున్న భావన బాధ పెడుతుంది. ఈరకమైన ఒత్తిడి, టెన్షన్, ఆందోళన కారణంగా రక్తపోటు పెరుగుతుంది. అందుకని మీ జీవితాచరణలో, వ్యవహారసరళిలో పారదర్శత ఉండాలి. దయాపూరితంగా మాట్లాడాలి. సంయమనంతో వ్యవహరించాలి. చిన్నచిన్న విషయాలకు కోపం తెచ్చుకోవడం, లేదంటే కోప్పడలేక కుమిలిపోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. అందుకని నిరంతరం ప్రశాంత చిత్తంతో ఉండాలని ఆయుర్వేదం చెబుతోంది. ఆహ్లాదంగా ఉండాలి. ముఖం మీద నవ్వు చెరగకుండా చూసుకోవాలి. ఈరకంగా మీ జీవనశైలిలో మార్పులు చేసుకుంటే రక్తపోటు నియంత్రణలో ఉంటుంది.

- డాక్టర్ ధేనువకొండ శ్రీరామమూర్తి, 9885297983

■ స్ఫూర్తినిచ్చిన గురువు

జీవితాన్నిచ్చారు

నా స్వగ్రామం వరంగల్ జిల్లాలోని నెక్కొండ మండల కేంద్రం. ఒకటి నుండి పదవ తరగతి వరకు నెక్కొండ జడ్‌పిహెచ్ఎస్‌లో, ఇంటర్మీడియట్, డిగ్రీ, మహబుబాబాద్‌లో చదివాను. తర్వాత ఎం.ఎ ఎకనమిక్స్ కోసం వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో చేరాను. నాకు స్ఫూర్తినిచ్చిన గురువు అక్కడి ప్రొఫెసర్ టి. పాపిరెడ్డిగారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా ఉన్న ఆయన దగ్గరే ఇప్పుడు పిహెచ్‌డి కూడా చేస్తున్నాను. కేవలం పాఠ్య పుస్తకాలల్లోని అంశాలను మాత్రమే బోధించకుండా, విద్యార్థులకు కావలసిన ఆర్థిక, సమాజిక అంశాలను చక్కగా బోధించేవారాయన. గురువు అంటే చీకటిని తొలగించే వాడని అర్థం. అనగా విద్యార్థులల్లోని అజ్ఞానాన్ని తొలగించి, జీవితంలో ఏదైనా సాధించాలనే కోరిక, అందుకు తగిన కృషి, పట్టుదలను పెంచాలి. తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే, పాపిరెడ్డి సార్ బోధన జీవితాన్ని ఇచ్చింది. విద్యార్థి కేవలం పాఠ్యపుస్తకాలపైననే దృష్టి సాధించకుండా, సమాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని బోధించారు. ఆయన వృత్తి బాధ్యతలతోపాటు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం విద్యార్థి దశలో, ప్రొఫెసర్ స్థాయిలో కృషి చేశారు. తాను నాకు గురువుగా లభించినందుకు, ఆయన దగ్గర విద్యనభ్యసించి నందుకు ఎంతో సంతోష పడుతున్నాను. ఈ సందర్భంగా నా ఆదర్శ గురువు అయిన పాపిరెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.

– ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మహామనిషి!

నా పేరు మరికంటి నరసింహ. నేను మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్ మండలం సంగోటం గ్రామంలో ఓ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించాను. నాకు స్ఫూర్తినిచ్చిన ఉపాధ్యాయుడు "శ్రీ ఓరుగంటి శేషఫణి శర్మ" గారు. ఆయన 1970లలో వీపనగండ్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్లోపాధ్యాయులుగా పనిచేశారు.

మా ఊరిలో నేను ఆరవ తరగతి వరకు చదివాను. తర్వాత కుటుంబం గడవడమే కష్టమైపోయింది. దానికి తోడు వరుసగా ఐదారేళ్ళ కరువు రావడంతో మా నాన్నగారు నన్ను శేషఫణిశర్మగారి ఇంటికి పంపించి, అక్కడే ఉండి చదువుకొమ్మని చెప్పారు.

కుల వివక్షత ఉన్న ఆరోజుల్లోనే నన్ను మా మాస్టారు నాలుగేళ్ల తన ఇంట్లో ఉంచుకుని విద్యాబుద్ధులు నేర్పించారు. అప్పుడే నా భావి జీవితానికి బంగారు బాటవేసి ఎంతో స్ఫూర్తినిచ్చారాయన.

ప్రతి రోజు ఉదయం ఐదు గంటలకే నిదురలేపి ఎప్పటి చదువును అప్పుడు చదువుకోవాలని, గురువులు మహనీయులు చెప్పిన మాటలను తు.చ తప్పకుండా పాటించాలని పదే పదే చెప్పేవాడు. ఈ సమాజంలో గౌరవప్రదంగా ఎలా జీవించాలో, కష్టనష్టాల్లో ఎలా నడుచుకోవాలో అడుగుడుగునా పాఠంలా బోధించేవారు. ఆ మహనీయుని చల్లని దీవెన వల్లే బ్యాంకు అధికారిగా నా ఉద్యోగ బాధ్యతల్ని నిర్వహిస్తున్నాడు.

అక్షరం రాని వారైనా నా ఎదుటికొచ్చి ఏమైనా సందేహాలడిగితే వాళ్ళకు అర్థమయ్యేలా చెప్పడం మా గురువుగారి నుండే నేర్చుకున్నాను. అటువంటి గురువుల రుణం ఏమిచ్చి తీర్చుకోగలం, నిరంతరం వాళ్ళకు చేతులెత్తి మొక్కడం తప్ప! ఈ శీర్షిక ద్వారా మా గురువును గుర్తు చేసుకునే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు.

– మరికంటి నరసింహ, వనపర్తి, మహబూబ్‌నగర్

వ్యంగ్య వీచికలు ■

పెళ్ళికొడుకు

భర్త: మనమ్మాయికి మంచి అందగాడిని, తెలివితేటలు గలవాడిని, ఆస్తిపరుడిని వరుడిగా తేవాలనుకుంటున్నాను.

భార్య: భలే చెప్పారండీ. ఈ విషయంలో మా నాన్నలా తొందరపడకూడదు.

స్నేహహస్తం

సుబ్బారావు తీవ్రమైన జబ్బుతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరాడు. బంధువులంతా చుట్టూ చేరారు. పక్కనే వున్న స్నేహితుడికి సైగ చేసి పెన్ను, పేపర్ తెమ్మన్నాడు. సరే, ఏదో చివరికోరిక నోటితో చెప్పలేక రాసి చూపిస్తాడని తెచ్చి ఇచ్చారు. అతి కష్టమ్మీద రెండు వాక్యాలు రాసి ప్రాణాలు విడిచాడు.

చనిపోయిన వెంటనే దాన్ని చదవడం ఎందుకని మడిచి జేబులో పెట్టుకున్నాడా స్నేహితుడు. దహన కార్యక్రమాలన్నీ అయిపోయిన తర్వాత ఆయన ఇంటికొచ్చి అందులో ఏం రాశాడో చదవాలని కుతూహలం కలిగింది. మడత విప్పి చూశాడు.

అందులో – "నా తల దగ్గర కూర్చున్నాయన నా ఆక్సిజన్ ట్యూబ్‌పై కూర్చున్నాడు. నాకు ఊపిరి ఆడటం లేదు" అని రాసి వుంది.

టీవీ జర్నలిస్టు

హైదరాబాద్ నగరం నడిబొడ్డున పెద్ద యాక్సిడెంట్ జరిగింది. ట్రాఫిక్ స్తంభించిపోయింది. అసలేం జరిగిందో, ఎంతమంది చనిపోయారో చూద్దామని చాలామంది జనం మూగారు. ఈ వార్త అందరికంటే ముందుగా ప్రసారం చేయాలని ఓ టీవీ జర్నలిస్టు ఉత్సాహ పడ్డాడు. జనాన్ని తోసుకుంటూ ముందుకు వెళ్ళలేక పోయాడు. చివరికి ఒక ఐడియా వచ్చి "తప్పుకోండి తప్పుకోండి నేను చనిపోయిన వాళ్ళ అబ్బాయి"నంటూ దొంగ ఏడుపు నటించాడు. జనం మెల్లగా తప్పుకొని దారిచ్చారు. తీరా చూస్తే కారు కింద ఓ గాడిద చచ్చిపడి వుంది.

పెట్టుబడి - శ్రమ

టీచర్: పెట్టుబడికి, శ్రమకి తేడా ఏమిటి?

విద్యార్థి: మీరు ఒక వ్యక్తికి డబ్బు అప్పిచ్చారనుకోండి. మీరు అప్పు ఇచ్చిన డబ్బు పెట్టుబడి. దానిని మీరు అతని దగ్గర నుంచి తిరిగి రాబట్టడానికి చేసే ప్రయత్నాలు శ్రమ.

తేడా

అమెరికాలో కరెంటు పోతే వాళ్ళు కరెంటాఫీసుకి ఫోను చేస్తారు.

జపాన్‌లో కరెంటు పోతే వాళ్ళు మొదట ఫ్యూజ్ చెక్ చేస్తారు.

అదే మనదేశంలో కరెంటు పోతే పక్కింట్లో చెక్ చేస్తాం– "ఓహో అందరింట్లో పోయిందా.. అయితే ఓకే.

■ కథ : గోపగాని రవీందర్



నడక ముచ్చట్లు

సాయంత్రం ఆరైంది. వచ్చే మిత్రుల కోసం నా కళ్ళు ఎదురుచూస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా హుషారుగా సాగుతోంది మా నడక సాయకాలం. అనేక ఆలోచనల కలబోత అది. పుస్తకాల్లోని పాఠాలకు విద్యార్థుల స్పందనలను పరిపరివిధాలుగా చర్చించుకుంటూ మా అడుగులు వేగంగా ముందుకు పడుతుంటాయి. ఇంకా బయటికి వెళ్ళలేదన్నట్లుగా శ్రీమతి చూపులతోనే అడుగుతుంది. అంతలోనే గేటు తీస్తున్న శబ్దంతో పాటు 'చందర్ సార్..సార్' అని రమేష్ సార్ పిలుపు వినిపించింది.

'వస్తున్న సార్' అంటూ పరుగున వాళ్ళను చేరుకొని సునీల్ సార్‌కు, రమేష్ సారుకు హలో చెప్పి మా దైనందిన కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. నడిచే కాళ్ళకు దూరభారం తెలియకుండా ఉండాలని నోళ్ళకు పనిచెప్పాం. ఉదయం నుండి సాయంకాలం వరకు చేసిన పని అలసటను మరుగు పర్చుకుంటూ కొత్త ఊహలకు రెక్కలు తొడుగుతూ సునీల్ సార్ సంభాషణ మొదలెట్టారు 'మన విద్యావిధానం వల్ల ఎలాంటి తరాన్ని రూపొందిస్తున్నామో ఆలోచిస్తున్నామా? తరగతి గదుల్లో విజ్ఞానానికి ఊపిరి పోస్తున్న మనం బలమైన యువతను అందిస్తున్నమా?' అన్నారు. మాకెదురొస్తున్న పరిచితులకు చేతుల సైగలతోనే హలోలు, బైబైలు కానిస్తున్నం.

'మన పని మనం చేస్తున్నం. చదువులతో పాటు సామాజిక అంశాలను, నైతిక విలువలను బోధిస్తున్నాం కదా. ఇంకా మనం ఏమి చేయగలం?' నిరాశగానే రమేష్ సార్ వాదనలోకి దిగిండు.

అసలే సంధ్యవేళ. మేం నడుస్తున్న ఆదిలాబాద్ టు మంచిర్యాల రోడ్డుపై వాహనాల రణగొణ ధ్వనులు మా మాటల్ని మింగేస్తున్నయి. ఉట్నూరు ఒక ఏజెన్సీ కేంద్రం. ఆదివాసుల్లో ఆధునిక జీవనం పట్ల అత్యంత పకడ్బందీగా ప్రణాళికలు తయారుచేసి అమలు పరిచే సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ.) భవనం, కొండలా నిలబడిన దానికేసి చూస్తూ, నాతో అడుగులు వేస్తున్న సహచరుల మాటల్ని వింటున్నా. వాళ్ళ సంభాషణపై దృష్టి సారిస్తున్నా. చేసేది ఉపాధ్యాయ వృత్తే ఐనా అనుకున్నది చేయలేక పోతున్నామనే వేదన నిలువెల్లా తొలుస్తున్నది. ఏదో ఒక రకమైన తెలియని వెలితి నిత్యం దహిస్తున్నది. ఇదమిద్ధంగా ఇది అని చెప్పుకోలేం. ఐటిడిఎ భవనం దాటగానే విశాలంగా పర్చుకున్న పచ్చని పొలాలు దర్శనమిచ్చాయి. అవి మమ్మల్ని ఆత్మీయంగా పలకరిస్తున్నట్లుగానే తలల ఊపుతున్నాయి. మనస్సులో చెలరేగే ఆలోచనలకు బ్రేకు వేసి వాటిని చూస్తూ వాదనలోకి దిగా.

'రమేష్ సార్, మన పని విధానాన్ని తప్పు పట్టడం కాదు. అలాగని అన్ని బాగానే ఉన్నయనేది కూడా కాదు. ఒక విషయం అర్థం కావడం లేదు, మన దగ్గర అంటే మన బళ్ళల్లో ఒకటి నుండి పదో తరగతి దాకా చదివినవాళ్ళల్లో చాలామంది అక్షరదోషాలు లేకుండా దరఖాస్తు రాయలేక పోతున్నారంటే నిందించాల్సింది ఎవర్ని? తనకు తానుగా ఒక పనిని ధైర్యంగా చేసుకోలేక పోతున్న వైనాన్ని చూస్తూ కూడా మనం స్పందించకుండా ఉండడం సమంజసమేనా?' నని కొంచెం గట్టిగానే అన్న.

అప్పటికే ఎత్తుగడ్డ మీదున్న రైస్‌మిల్లు దగ్గరికి చేరుకున్నాం. పట్టణంలోని లైట్లు మిణుకు మిణుకు మని ఆకాశంలోని చుక్కల్లెక్క కన్పిస్తున్నాయి. నా మాటలు వాళ్ళల్లో అలజడిని కలిగించినట్టుగానే ఉన్నాయి. అడుగుల వేగం పెరిగింది. పొలాల నుండి వచ్చే చల్లని గాలులు చెమట పట్టిన దేహాలను తాకుతూ వింతానుభూతినిస్తున్నది. ఆఫీసులో పనులు ముగించుకున్న ఉద్యోగులు కొందరు గేటు దగ్గర నిలబడి మాట్లాడుకుంటున్నారు. అక్కడున్న హోటల్‌లోని బెంచీలపై కూర్చున్నాం, నడక అలసటను తీర్చుకోవటానికి రోజు మాదిరిగానే.

'చందర్ సార్ మీరు మాట్లాడినట్టుగా మనం పూర్తి బాధ్యులం కాదు. మన శక్తి మేరకు చేసుకు పోతున్నాం. మనం ఒక వ్యవస్థలో భాగం. మనమే ఒక వ్యవస్థ కాదు కదా. నేటి విద్యావిధానం గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత బాగుంటుందేమో. మనం చదువుకొనేరోజుల్లో ఉండే తీరును మనం పాటించడం లేదు. నాటి ఉపాధ్యాయుల దీక్షాదక్షతలను గూర్చి ఎంత చెప్పుకున్నా తక్కువే. నేడు మునుగుతున్న ఓడలో పయనిస్తున్నాం అంతే' నంటూ రమేష్ సార్ తన భావాల్ని వ్యక్తంచేశారు...చేతులకు పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడ్చుకుంటూ.

పక్కనే కూర్చున్న సునీల్ సారు తన వాదాన్ని అందుకున్నాడు– 'మన చదువులను ఇప్పటివారితో పోల్చుకోవడం సరైంది కాదు. కానీ ఒక బలమైన తరాన్ని సృష్టించే అవకాశాన్ని కోల్పోకూడదు. అందుకే వీలైనంతగా మన బడి పిల్లలతోనే గడపాలనుకుంటాను. ఉత్తేజాన్నిచ్చే ఉపాధ్యాయుల జీవిత కథల్ని చదువుతు స్ఫూర్తి పొందుతాను. ముఖ్యంగా నాకు చింగిజ్ ఐత్‌మాతోవ్ రాసిన 'నా తొలి ఉపాధ్యాయుడు'ను తలుచుకుంటే నేను ఎన్నుకున్న జీవితం ఉన్నతమైందనుకుంటాను. ప్రశ్నించే పిల్లలను చూడాలని తహతహలాడుతాను' నని అన్నారు.

నేను కల్పించుకుంటూ 'ఒక లెక్క చెప్తా, వినండి. ఒకటి నుండి పది వరకు చదివిన విద్యార్థిని తీసుకుంటే ప్రతి తరగతి నుండి కనీసంగా ఒక వంద పదాలను నేర్చుకుంటాడు అనుకోండి. పది తరగతులు అయిపోయే సరికి వెయ్యి పదాలు కచ్చితంగా అవగాహనతో కూడినవిగా రావాలి. వాటితో అనేక రకాలైన ప్రయోగాలు చేయొచ్చు. ధైర్యంగా మాట్లాడొచ్చు.

దరఖాస్తులు రాయొచ్చు. పాటలు రాయొచ్చు. కవితలు రాయొచ్చు. చిన్న చిన్న కథలు రాయొచ్చు. అర్థవంతమైన చక్కటి సంభాషణ చేయొచ్చు కదా. ఇలా ఎందుకు జరుగుతలేదు చెప్పండి?' అన్నా.

రెవెన్యు డివిజనల్ అధికారి తన క్వార్టర్ ఆవరణలోని షటిల్ కోర్టులో ఆయాసపడుతూ ఆడుతున్న దృశ్యాలు మాకు మసకమసకగా కన్పిస్తున్నాయి. కోర్టుకు ఇరుపక్కలున్న లైట్లకాంతి వల్ల, అడ్డుగున్న తడకల గోడ వల్ల పూర్తి ఆటను చూడలేక పోతున్నాం. కొడుకుతోనో, కూతురుతోనో ఆడుతున్నట్టు అక్కడి మాటలను బట్టి తెలుస్తుంది. చేతిలో నీళ్ళ సీసా, టవల్ పట్టుకొని కొంచెం దూరంగా పనివాడు నిలబడి బెరుకుగా చూస్తున్నాడు. అటు ఆట సాగుతుంది. ఇటు కుడి పక్కగున్న రోడ్డు మించి నిరంతరంగా వాహనాల ప్రవాహం. వీటిని చూస్తునే మా మాటలు మరింత జోరందుకున్నాయి.

'చందర్ సార్, మీరు మరీ తీవ్రంగా ఆలోచిస్తున్నారు. ఒకప్పుడు పిల్లలు నేర్చుకోడానికి గురువు తప్ప వేరే మార్గం లేకుండే. అందుకే అడవుల్లో నిర్మించుకున్న గురుకులాల్లో ఉంటూ విద్యను అభ్యసించేవారు. పూర్తి ధ్యాస గురువు గారి బోధనపై ఉండేది. నేడు కాలం ఆధునికంగా ఎంతో ముందుకు పోయింది. విని నేర్చుకోవడం కాదు చూసి నేర్చుకుంటున్నారు. ప్రతి ఇంట్లో తిష్ఠ వేసిన టీవీ చాలు పిల్లల సమయాన్ని తినేయటానికి. మనం చెప్పే పుస్తకాల్లోని విషయాలకంటే రంగురంగుల అందమైన చిత్రాలతో కనిపించే కార్యక్రమాలకు ఆకర్షితులవు తున్నారు. ఈ చదువును అందుకోలేకపోతున్నారు. అభ్యాసం లేకుండా ఏ విద్యరాదనేది జగమెరిగిన సత్యం. ఇంట్లో సైతం చదివే వాతావారణం ఉండాలి. అనుక్షణం ఆకట్టుకునే సీరియల్స్, పాటల డాన్స్ కార్యక్రమాలు, సినిమాలు అంటూ నాన్‌స్టాఫ్ ఎంజాయ్‌మెంట్‌తో ఇళ్ళు కాస్తా థియేటర్లుగా మారిపోంయాయి. ఇక చదువెలా సాగుతుంది? మన పాఠాలెట్లా ఒంటబట్టయి చెప్పు? పరిసరాలు విద్యను నేర్చుకునే విధంగా ఉండాలి కదా?' నంటూ రమేష్ సార్ ఆగ్రహంగా చెప్పిండు.

'రమేష్ సారు..మీ బాధను అర్థం చేసుకుంటా. అసలు మన సమాజంలో ప్రశ్నించే చైతన్యాన్ని నశింపజేయటానికి పుట్టిన సాధనమే టీవీ అంటాను. సంక్షేమ కార్యక్రమాల గూర్చి ప్రజలు ఆలోచించకుండా ఉండటానికి రూపొందించిన అందమైన సాధనమే టీవీ. పెట్టుబడిదారులు తాము ఉత్పత్తి చేసే సరుకులను ప్రచారం చేసుకోడానికి అనువుగా తయారు చేసుకున్న సాధనమిది. ఇదొక మత్తు మందులా పనిచేస్తూ ప్రశ్నలడిగే చైతన్యాన్ని చంపుతున్నది. కాబట్టి దాని వికృతి రూపాల పర్యవసానమే మన విద్య మీద కూడా పడుతుందని' ఆవేదనతో అన్నారు సునీల్ సారు.

'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలామా..పోరు తెలంగాణమా...' పాట మైక్రోమ్యాక్స్ సెల్ నుండి బిగ్గరగా వినిపిస్తుంటే రోడ్డువైపు చుశాం. పొలాల వైపు నడుస్తున్న రైతుల గుంపు ఆ పాటను వింటున్నారు. పాట వినిపిస్తున్న దిక్కున చూస్తున్న రమేష్ సారుకు మాట్లాడడానికి వస్తువు దొరికినట్టైంది. 'మీరు వాదిస్తున్నట్టుగా టీవీ ఒకటే కాదు, నేటి సమాచార విప్లవంలో శరవేగంగా దూసుకువచ్చింది సెల్‌ఫోన్. విద్యార్థులను బాగా ప్రభావితం చేస్తున్నది. కుటుంబంలో నలుగురుంటే అందరికి సెల్ వుండాల్సిందే రెండు నంబర్లతో. త్వరితంగా సమాచారాన్ని అందించటానికి కనిపెట్టిన సెల్ మానవ సంబంధాలను మంట కలుపుతోంది. ముఖ్యంగా ఇటీవల అమ్మాయిలపై పెరిగిన అత్యాచారాలకు ఇదో కారణమే. మనం సత్యమును పలుకుమని నేర్పుతుంటే అబద్ధాలను ఆడిస్తుంది సెల్. కొన్ని ఫిచర్స్ మంచివి ఉండొచ్చు కానీ దీని భాగోతాలను రోజు పత్రికల్లో చదువుతూనే ఉన్నాం కదా. దీనిపై నియంత్రణ లేకపోవడం కూడా విద్యార్థులను తప్పుదారి పట్టిస్తుందన్నాడు'

'అంతే కాదు రమేష్ సారు, టివి, సెల్‌ఫోన్‌లే కాదు, కంప్యూటర్లు కూడా విద్యపై ప్రభావం చూపుతున్నయి. గత రెండు దశాబ్దాలుగా ఇండాయాపై ఇన్‌ఫర్మేషన్ టెక్నాలోజి విరుచుకపడ్తుంది. అందులో భాగంగానే మారుమూల ప్రాంతాల్లోకి సైతం ఇంటర్‌నెట్ సౌకర్యం వచ్చింది. దీంతో విద్యార్థులకు ధారణ శక్తితో పనిలేకుండా పోయింది. కావాల్సిన సమాచారం గుగూల్ సర్చ్ చేస్తూ ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నరు. కంప్యూటర్ విద్యను సైతం మన పాఠశాలల్లో బోధిస్తున్నం కదా. పంటలు పండే విధానం వద్దు, నెట్‌ను ఎలా చూడాలో చెప్పమంటున్నరు. ఉపాధ్యాయుడు ప్రేక్షకపాత్రుడయ్యాడని' సునీల్ సారు తన వేదనను పంచుకున్నడు.

మీ బాధను అర్థం చేసుకుంటా. అసలు మన సమాజంలో ప్రశ్నించే చైతన్యాన్ని నశింపజేయటానికి పుట్టిన సాధనమే టీవీ అంటాను.



'మన సంభాషణ రూటు మారుతుంది. మనిషి మేధో వికాసానికి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతికి ప్రతీకలు టీవీ, సెల్‌ఫోన్, కంప్యూటర్లు. ఎన్నో అద్భుత విషయాల్ని మనం చూడగలుగుతన్నం, వినగలుకుతున్నం, తెలుసుకోగలుగుతున్నం కాబట్టి వాటితోటి ప్రయోజనాల్ని కూడా చూడాలి అంటున్న. ఒక్క ఛానల్ ప్రసారాలు ఉన్నప్పుడు ఇష్టమైన కార్యక్రమం కోసం ఎదురుచూసేవాళ్ళు. ఇప్పుడు వందల ఛానళ్ళ ప్రసారాలతో ఏది ఎన్నుకోవాలో తెలియనితనం వచ్చింది. ఒక్క టెలిఫోన్ ఉన్నప్పుడు ఎక్కువ కావాలనుకున్నాం. ఇప్పుడేమో మితిమీరిన వైనాన్ని చూస్తున్నాం. మరీముఖ్యంగా మన తెలుగు ఛానళ్ళ ప్రోగ్రాములు ప్రపంచంలోని ఏ ప్రాంతం వాళ్ళు కూడా రూపొందించరు. టీవీ లేని రోజుల్లో చుట్టుపక్కల వారితో మాటముచ్చట్లుండేవి. ఇప్పుడు హౌజ్ అరెస్టులా ఎవరి గూడులకు వారు పరిమితమయ్యారు.అందుకని కలివిడితనం పిల్లలకు రావడం లేదు. ఇంతకు నేను చెప్పేది ఏమిటంటే విలువైన విషయాలను తెలుసుకోవటానికి టివి, కంప్యూటర్లు అవసరమే కాని ప్రతింట్లో ఉండద్దు. నాలుగు కూడళ్ళ మధ్య పెద్దపెద్ద తెరల ద్వారా చూసే ఏర్పాటు చేయాలి. ఈ నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయితీ ద్వారా లేదా యువజన, మహిళ సంఘాల ద్వారా జరగాలి. మన పిల్లలకు అప్పుడు అనుకున్నంత సమయం దొరుకుతుంది. చదువులపై దృష్టి సారిస్తారు' అన్నాను.

'పిల్లల్లో లోపిస్తున్న నైతిక విలువలు ఆందోళన కల్గిస్తున్నాయి. ఏ అంశమైనా తేలిగ్గా తీసుకుంటున్నారు. మనం ఎంత ముఖ్యమైన విషయం చెప్పినా వింటున్నట్టుగనే ఉండదు. చిరస్మరణీయులైన గొప్పవాళ్ళ బాల్యంలోని ఆసక్తికర ఉదంతాలను చెప్పినా అదోలా ముఖాలు పెట్టుకుంటారు. వీళ్ళ బాల్యం ఇలా నిర్వీర్యం కావాల్సిందేనా. ఇంకా ఆటలైతే క్రికెట్, కంప్యూటర్ గేమ్స్ తప్ప మిగతావి అక్కర్లేదని' సునీల్ సారు బాధగన్నాడు.

లైటు పురుగులు చుట్టు ముసురుతున్నాయి. మా సహనానికి

పరీక్షపెడుతున్నాయి. ఐటిడిఏ ప్రధాన గేటు నుంచి ప్రాజెక్టు అధికారి వాహనం బయటకు వెళుతుంది. ఆ ప్రాంగణంలో ఉన్నోళ్ళంతా అలర్ట్ అయ్యారు. ఇది మేం రోజు చూసేదే. చూసినప్పుడల్లా కొత్తగనిపిస్తది. అటుకేసి చూస్తూనే సార్లతో ఇలాగన్న– 'అసలు విలువంటే ఏమిటి? నైతిక విలువంటే ఏమిటి? వీటికి మార్క్స్ సమాధానం ఒక రకంగుంటే విద్యావేత్త, చుక్కా రామయ్యది ఇంకొరకంగుంటది. ఆయన రాసిన ఒక వ్యాసంలో విలువ గూర్చి ఇలా చెప్పారు: స్టాక్ మార్కెట్‌లో రూపాయి విలువ పెరగడం, తగ్గడం ఎట్లా ఉంటదో అలాగా విద్యార్థి చదువుకు ఎంత డబ్బు ఖర్చు పెట్టి కొనుక్కుంటారో దానికి రెట్టింపు సంపాదించాలని కోరుకోవడం సహజం కదా. ఇక్కడ విలవంటే సంపాదనే అని. ఇక నైతికత గురించి మనం మర్చిపోవల్సిందే. మనం చెప్పేది మనమే పాటించనప్పుడు విద్యార్థులెలా పాటిస్తారని అనుకుంటారు' అన్నాను.

'కరెక్టు సారు మీరు చెప్పింది. మీకో ఆసక్తికరమైన ముచ్చట చెపుత వినుర్రి. ఓపికుందా?' అన్నాడు రమేష్ సార్.

ఒక వ్యక్తి ఉన్నతుడైనాడంటే చిన్నతనంలో అతన్ని ప్రభావితం చేసిన గురువో, తల్లో, తండ్రో, బంధువో, నాయకుడో, సంస్కర్తో, పుస్తకమో ఏదో ఒకటుంటుందని తెలుసు మనకు. నైతిక విలువలు అంతమైపోతున్నాయని గగ్గోలు పెడ్తున్నాం. అది కరెక్టు కాదు. ఎందుకంటే విలువలు అలాగే ఉన్నాయి. వాటిని ఆచరించే మనుషులు మారుతున్నారు. వాటిని తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. మనం దాన్ని తిప్పికొట్టాలి. అది విద్యతోనే సాధ్యం.

'చెప్పండి సార్' ఒకే గొంతుగన్నాము మేం.

'మాయింటి పక్క శ్రీధర్ సార్ ఉంటడు గదా. వాళ్ళ స్కూల్ ముచ్చట చెప్పిండు. ఆయన పని చేసుకుంటనే మన పాఠశాలల విద్యార్థుల కోసం వివిధ రకాలైన స్వచ్ఛంద సంస్థల వాళ్ళు చేసే కార్యక్రమాల్లో పాల్గొంటడు. వాళ్ళ స్కూల్లో ఆడపిల్లలెక్కువ. మన పాఠశాలల్లో ప్రభుత్వం చేసిన మంచి పనుల్లో పగటిపూట బువ్వ పెట్టుట ఒకటి గదా. చుట్టుపక్కల ఆదివాసి గూడల నుండి వచ్చే ఆడపిల్లలు నామోషీగా ఉంటదని ప్లేట్లు తెచ్చుకోరు. ఒక ఎన్.జి.వో. వాళ్ళకు ఈ సమస్య గూర్చి చెప్పితే వాళ్ళు ఓ మూడు వందల పళ్ళాలు అందించారు. సరిపడ ప్లేట్లున్నయి. అందరు తినాలని శ్రీధర్ సారు పిల్లలకు చెప్పిండట. కొన్ని రోజులు గడిచిన తర్వాత ఒకరోజు ఎందరు తింటున్నరో చూడటానికి పోయిండట. చాలా మంది తినకపోవడం గమనించిండట. ఎందుకు తింటలేరో చూస్తే ప్లేట్లు మాయం. ఇట్లేందుకు జరిగిందని ఆరాతీస్తే వంటచేసే వారితో హెచ్.యం. ఒప్పందం చేసుకొని నెలకింతని డబ్బులు తీసుకుంటున్నరు. అందరు తింటే గిట్టుబాటు కాదు గదా. అందుకే ప్లేట్లు లేకుండ చేయడం. ఒకరేమో బయటి నుండి విరాళాలు సేకరించిస్తే, మరొకరు ఒక్కపూట పెట్టె భోజనంలో సైతం అవినీతికి పాల్పడుతున్నడు. ఇందులో మన ఉపాధ్యాయుడే ప్రధాన పాత్రధారైతే, నైతిక విలువల గూర్చి మాట్లాడుకోవడం చాలా విడ్డూరం గుందన్నడు' రమేష్ సార్.

'ఇట్లాంటి ఘట్టాలు రాసేవారుంటే ఎన్ని పర్వాలు అయితవో లెక్క తెల్వదు అవినీతి భారతంలో. అవకాశం ఉండే ప్రతిచోట దోచుకుతింటున్న కథనాలను రోజు పేపర్లల్లో సీరియల్‌గా వేస్తున్నారు. దేశంలోనే అతిపెద్ద కుంభకోణం 2జిది. లక్షా డెబ్బై ఆరువేల కోట్ల అవినీతి జరిగిందని అంటున్నారు. అవినీతి వ్యతిరేక ఉద్యమాలు ఈమధ్యన ఊపందుకున్నాయి. ఉలిక్కిపడిన యువత అన్నాహజారే పోరాటంలో చురుగ్గా పాల్గొంటోంది' అన్నాను.

దీనికి ప్రతిగా సునీల్ సార్ స్పందించారు– 'మీకింకో సంగతి తెలుసా! మనకు ఎదురుంగా కనబడుతున్న ఐటిడిఎ ఆధ్వర్యంలో కూడా ఆశ్రమోన్నత పాఠశాలలు నడుస్తున్న విషయం మీకు తెలుసు కదా. నాతో చదువుకున్న మిత్రుడు శ్రీకాంత్ వాటిలో పనిచేస్తున్నడు. మొన్నొకసారి ఇక్కడికి వచ్చినప్పుడు కలిసుండె. వాళ్ళ హెచ్.యం. గూర్చి చెప్పిండు. ఆయన ఇంట్లో కంటే స్కూల్లోనే ఎక్కువగా ఉంటాడట. బావిలోని మోటర్ చెడిపోతే నిబంధనలను పక్కకు పెట్టి బాగుచేయించిండు. పిల్లలు ఇబ్బంది పడకూడదని చేసిండు. పెట్టిన ఖర్చునివ్వమని అధికారులకు దరఖాస్తు పెట్టుకుంటే అది చక్కర్లు కొడ్తుంది. ఇప్పటికీ రెండు సంవత్సరాలు దాటిందట. ఆ బిల్లుకు మోక్షం మాత్రం రాలేదట. పిల్లల పేరుతో జేబులు నింపుకునే వారే కాదు ఖాళీ చేసుకునే వారున్నరని చెపుతున్న. విలువలు చూపించేవి కావు పాటించేవన్నరు.'

'కొందరు నిజాయితీగానే పనిచేసేవారుంటారు. కొందరు పనిని ఎగ్గొట్టేవారుంటారు. పని చేసేవారినే ఆదర్శంగా తీసుకుంటాం కదా. మరీ ముఖ్యంగా విద్యారంగంలో ఉన్నవారు ఉన్నతంగా ఉండాలి. మన లోపాలను కప్పిపుచ్చుకోటానికి అనుకూలమైన వాటిని ఉదాహరణలుగా చెప్పుకోటం సరైంది కాదు' అన్నాను.

'సార్ మీరెన్నైనా చెప్పండి వింటాం. చట్టాలను రూపొందించటంలో, అమలు చేయడంలో ముఖ్యులైన ఐఏఎస్‌లే ఇవాళ సిబిఐ విచారణకు క్యూ కడుతున్నారు. కొందరు ఆరోపణలతో జైళ్ళకు సైతం వెళ్ళారు. దీనికి ఎవరు బాధ్యులు? ఎటు పోతుంది మన ప్రగతి? ఈ డబ్బు ప్రజలదే కదా. నేరం చేసిన వాడికి శిక్ష పడ్తుందని నమ్మకం లేదు. అలాగైనా కొందరు భయపడేవారు కావచ్చు. ఇదీ ఒక కారణమే కావచ్చు అవినీతి పెరగటానికి' రమేష్ సార్ అన్నాడు.

'దీనంతటికి కారణం ఒక్కటే అనుకుంటున్న నేను. ఒక వ్యక్తి ఉన్నతుడైనాడంటే చిన్నతనంలో అతన్ని ప్రభావితం చేసిన గురువో, తల్లో, తండ్రో, బంధువో, నాయకుడో, సంస్కర్తో, పుస్తకమో ఏదో ఒకటుంటుందని తెలుసు మనకు. నైతిక విలువలు అంతమైపోతున్నాయని గగ్గోలు పెడ్తున్నాం. అది కరెక్టు కాదు. ఎందుకంటే విలువలు అలాగే ఉన్నాయి. వాటిని ఆచరించే మనుషులు మారుతున్నారు. వాటిని తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. మనం దాన్ని తిప్పికొట్టాలి. అది విద్యతోనే సాధ్యం. అందులో మనం భాగం అవుతున్నందుకు గర్వపడాలి. తిలాపాపం తలా పిడికెడన్నట్టు కాకుండా మన చేతుల్లో మట్టి ముద్దల్లాంటి పిల్లలున్నారు. వాళ్ళను అనుకున్న ఆకృతుల్లోకి తీసుకరావటానికి శాయశక్తుల పాటుపడాలి. విద్యార్థులు ఉన్నతంగా ఎదగటానికి జీవితాల్ని ధారపోసిన గురువులను గుర్తుకు తెచ్చుకోవాలి. పనిలోనే ఆనందాల్ని వెతుక్కుంటూ ప్రస్థానాన్ని సాగించాలి. అవినీతి రహిత సమాజ వికాసం కోసం పని చేయాలి' అంటూ బెంచీపై నుంచి లేచాను.

నన్ను అనుసరిస్తూ మిత్రులు కూడా నిలబడ్డారు. వీధిలైట్లు వెలగపోవడంతో రోడ్డుపై చిక్కటి చీకటి పర్చుకుంది. ఎదురెదురుగున్న పివో, ఆర్డివోల ఇండ్లలో పర్చుకున్న కాంతిని చూస్తూ, మార్పులకు శ్రీకారం చుట్టే ఆలోచనలకు పదును పెడ్తూ ముందుకు సాగుతున్నం చీకట్లలో... నడక ముచ్చట్లకు వీడ్కోలు పలుకుతూ ఇంటిదారిన కదిలినం..!

రచయిత సెల్ :94409 79882

■ సంగీతం

నోరూరించే స్వరాల విందు

'తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలిగిన వాడే మనిషోయ్' అని ఓ మహానుభావుడు అన్నాడు. మనిషి జీవించాలన్నా, పని చేయడానికి ఓపిక కావాలన్నా ఆహారం కావాలి. అది రుచిగా ఉంటే ఇష్టంగా తింటారు. ఇష్టమైన పదార్థాలు రుచిగా వుంటే లొట్టలు వేసుకుంటూ తింటారు. ఇంతటి ముఖ్యమైన ఆహారం లేకుంటే మనిషి మనుడగే కష్టం. అలాంటి ముఖ్యమైన అంశం సినిమాల్లో వంటలు, భోజనం రూపంలో చాలా సీన్లలో కనిపిస్తుంది. ఒక్క దృశ్యాలకే పరిమితమైపోకుండా భోజనానికి సినిమాల్లో పాటల్లో కూడా స్థానమిచ్చారు. వాటిల్లో కొన్ని...

వివాహభోజనంబు... వింతైన వంటకంబు. వియ్యాలవారి విందు... ఒహోహ్హో నాకె ముందు... హ్హా... హ్హా.హ..." 1957లో విడుదలైన మాయాబజార్‌లోని ఈ పాటను ఎస్వీ రంగారావు పై చిత్రించారు. అరిసెలు, గారెలు, బూరెలు, లడ్లు, పులిహోర... ఇలా అన్ని రకాల పిండి వంటల పేర్లను చేర్చి నోరూరించేలా చిత్రించడమే కాదు, వీనుల విందైన సాహిత్యం, లొట్టలు వేసుకుంటూ ఎస్వీఆర్ తినే అభినయంతో ఆకట్టుకుంది ఈ పాట. పింగళి నాగేంద్రరావు రాసిన ఈ పాటను ఘంటసాల సంగీత దర్శకత్వంలో మాధవపెద్ది సత్యం పాడారు.

'అందమైన బావా, ఆవు పాల కోవా.. విందుగా పసందుగా ప్రేమనందుకోవా.... హాటు హాటు గారె, స్వీటు స్వీటు పూరీ...' రుణానుబంధం సినిమాలో ఏయన్నార్, గిరిజలపై చిత్రించిన ఈ పాటలో ఎన్నో రకాల ఆహార పదార్థాలను తన బావతో తినిపించి అతని ప్రేమను పొందాలనుకుంటుంది మరదలు. పి.బి.శ్రీనివాస్ పాడిన ఈ పాటకు సముద్రాల రచన, పి. ఆదినారాయణరావు సంగీతం సమకూర్చారు.

ఎన్టీఆర్, కృష్ణకుమారి నటించిన దేవాంతకుడు చిత్రంలో 'గో గో గోంగూర... జై జై జై ఆంధ్రా... గోంగూర జై ఆంధ్రా కోరుకో మనసారా..' పాటలో గోంగూర రుచిని పొడుగుతూ పి.బి.శ్రీనివాస్, జానకి పాడతారు. ఆరుద్ర రాసిన ఈ పాటకు అశ్వద్ధామ సంగీతం సమకూర్చారు.

నోరూరించే స్వరాల విందు

అగ్గి పిడుగు చిత్రంలో 'లడ్డు లడ్డు... బందరు మిఠాయి లడ్డు... బూంది లడ్డు, కోవా లడ్డు...' అంటూ లడ్లలో ఎన్ని రకాలున్నాయో, దాని రుచి ఎంత అమోఘంగా ఉంటుందో.. అన్నీ వివరిస్తారు ఈ పాటలో. జి.కృష్ణమూర్తి రాసిన ఈ పాటకు ఘంటసాల సంగీతం అందించారు. ఘంటసాల, జానకి పాడారు.

బాల భారతం చిత్రంలో 'విందు భోజనం... పసందు భోజనం... ఏటి గట్టు తోటలోన మేటి భోజనం...' నేతి గారెలు, బూరెలు, పరమాన్నం, పులిహోరల గురించి సాగే ఈ పాటను చిన్నతనంలోని కౌరవులు, పాండవుల మీద చిత్రించారు. పురాణాల్లోని భారతంలో భోజనం మాట వస్తే ముందుగా గుర్తుకొచ్చేది భీముడు. ఈ పాటలో భీముడితోపాటు మిగిలిన అందరూ భోజన ప్రియుల్లా కనిపిస్తారు. కొసరాజు రాసిన ఈ పాటను ఎల్.ఆర్.ఈశ్వరి పాడారు.

అందాల రాముడు చిత్రంలో రామకృష్ణ పాడిన 'సమూహ భోజనమ్ము.. సంతోషమైన విందు... అంతస్తులన్ని బందు అహ్హహ్హా ఏమనందు...' పాటలో సహపంక్తి భోజనంలో ఎంత సంతోషంగా ఉంటుందో వివరిస్తూనే అంటరాని తనాన్ని కూడా విమర్శిస్తారు.

'పాపా... పప్పుదప్పళం... అన్నం... నెయ్యి... వేడి వేడి అన్నం మీద కాచిన నెయ్యి...' పాట ఒక ఆఫీసులోని వారంతా సరదాగా వన భోజనానికి వచ్చినప్పుడు పాడే పాట. పెళ్లిపుస్తకంలోని ఈ పాటను కె.వి.మహదేవన్ స్వరపరచగా బాలసుబ్రమణ్యం పాడారు.

'ఆహా ఏమి రుచి... అనరా మైమరచి... రోజూ తిన్నా మరి మోజే తీరనిది' అంటూ వంకాయ అమోఘ రుచిని పొగుడుతూ, వాటితో ఎన్ని రకాల వంటకాలు చేయొచ్చో చెప్తారు ఈ పాటలో. ఎగిరే పావురామా చిత్రంలోని ఈ పాటను లైలా, సుహాసిని మీద చిత్రించారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన ఈ పాటకు ఎస్వీ కృష్ణారెడ్డి సంగీతం, చిత్ర గాత్రంతో పాటకు ఆమోఘ రుచి వచ్చినట్టే ఉంటుంది.

'ఆవకాయ మన అందరిదీ.. గోంగూర పచ్చడి మనదేలే... ఎందుకు పిజ్జా?... ఎందుకు బర్గర్?' అంటూ సాగే ఈ పాట బాలసుబ్రమణ్యం, లక్ష్మి

నటించిన మిధునం చిత్రంలోనిది. ఇడ్లీలోకి కొబ్బరి చట్నీ, మిర్చీ బజ్జీల ముందు పిజ్జా, బర్గర్, పాస్తాలు ఎందుకు పనికి వస్తాయంటారు. ఏ వంటకం ఎప్పుడు తింటే బాగుంటుందో వివరించే ఈ పాటను తనికెళ్ల భరణి రాశారు. వీణాపాణి సంగీతం, ఎస్పీ బాలు, స్వప్న పాడారు. ఈ పాట మిస్సమ్మ చిత్రంలోని 'బృందావనమందరిదీ.. గోవిందుడు అందరివాడేలే...' పాటకు పేరడీలా ఉంటుంది.

ప్రకాష్‌రాజ్, స్నేహ నటించిన ఉలవచారు బిర్యాని చిత్రంలోని 'ఈ జన్మమే రుచి చూడడానికి దొరికెరా... ఈ లోకమే వండి వార్చడానికి వేదికరా...' ఆత్రేయ పురం పూతరేకు, తాపేశ్వరం మడతకాజా, నెల్లూరు చేపలు.. ఇలా ఏ ఊళ్లో ఏ వంటకం స్పెషలో వివరిస్తుంది ఈ పాట. చంద్రబోస్ రాసిన ఈ పాటను ఇళయరాజా స్వరకల్పనలో కైలాష్ ఖేర్ పాడారు. ఇలా సినిమాల్లోని ఎన్నో తిండి పాటలు భోజన ప్రియులనే కాదు, అందరినీ అలరించాయి.

- బి.మల్లేశ్వరి

నెమలీక

స్నేహం

ఒకసారి లండన్‌లో అడవి జంతువులను ప్రదర్శించారు. ఆ ప్రదర్శనకు రుసుముగా అక్కడున్న క్రూర మృగాలకు ఆహారం గానీ, డబ్బుగానీ తీసుకునేవారు.

ఒక వ్యక్తి ఆ అడవి జంతువులను చూడాలనుకున్నాడు. అడవి జంతువులకు ఆహారంగా ఓ కుక్కపిల్లను తీసుకుని వెళ్లాడు. ఆ కుక్కపిల్లను తీసుకుని ప్రదర్శనశాల వారు లోపలికి పంపించారు. సింహానికి ఆహారంగా ఆ కుక్కపిల్లను బోనులో పడేశారు. ఆ కుక్కపిల్ల తోక ముడుచుకుని, బోనులో ఓ మూల నక్కింది. సింహం కుక్కపిల్ల దగ్గరకు వెళ్లి వాసన చూసింది. కుక్కపిల్ల వెల్లకిలా పడుకుని కాళ్లు పైకెత్తి తోక ఆడించింది. సింహం తన పంజాతో కుక్కపిల్లను లేపి సరిగా నించోబెట్టబోయింది.

సింహం దగ్గరకు రాగానే కుక్కపిల్ల చెంగున లేచి తన వెనుక కాళ్లమీద సింహం ఎదురుగా కూర్చుంది. సింహం కుక్కపిల్లను చూస్తూ కూర్చుందే గానీ దాన్ని తినలేదు.

ఆ ప్రదర్శన శాల యజమాని వచ్చి సింహానికి మాంసం ముద్ద ఆహారంగా వేశాడు. సింహం ఆ మాంసం ముక్కను చీల్చి, ఓ చిన్న ముక్కను కుక్కపిల్లకు ఇచ్చింది. అలా ఆ కుక్కపిల్ల సింహం దగ్గరే తిని, పడుకునేది. రెండీటి మధ్య స్నేహం కుదిరింది. అలా కొన్నాళ్లు గడిచింది.

ఒకరోజు కుక్కపిల్ల యజమాని జంతు ప్రదర్శన శాలకు వచ్చాడు. సింహం బోనులో ఉన్న కుక్కపిల్లను చూసి తనదేనని గ్రహించాడు. ఆ కుక్కపిల్లను తీసుకెళ్లడానికి జంతు ప్రదర్శన శాల యజమానికి అడిగాడు. అందుకు ఆ యజమాని అంగీకరించాడు. అయితే సింహం బోను దగ్గరికి వెళ్లి కుక్కపిల్లను తీసుకోబోతే సింహం గట్టిగా ఘర్జించింది. ఆ కుక్కపిల్ల యజమాని చేసేదేమీ లేక వెనుదిరిగాడు.

సంవత్సరం తర్వాత కుక్కపిల్లకు జబ్బు చేసి చనిపోయింది. కుక్కమీద బెంగతో సింహం తిండి తినడం మానేసింది. రాత్రింబవళ్లు పెద్దగా గర్జిస్తుండేది. కుక్కపిల్ల శవాన్ని తీసేయడానికి వచ్చిన వాళ్లకు కూడా దగ్గరికి రానివ్వలేదు. అలా ఐదు రోజులు నిద్రాహారాలు మాని ఆరో రోజు సింహం కూడా చనిపోయింది.

రంగులు వేద్దాం

దారి చెప్దాం



జవాబు : 6

రెండోది ఏది?

ఈ అబ్బాయి ఒక చేతికే గ్లౌజ్ (చేతి తొడుగు) వేసుకున్నాడు. ఇక్కడున్న చేతి తొడుగుల్లో రెండోది ఉంది. అది ఏదో గుర్తించారా?

E	C	O	N	T	E	N	T	M	E	N	T	S
F	C	I	X	B	A	V	M	I	O	N	G	L
L	A	N	B	A	N	I	P	A	B	N	S	T
Z	D	I	E	P	C	R	C	X	I	I	O	F
L	I	C	T	I	U	T	B	S	F	O	L	C
O	S	W	P	H	D	U	S	Y	O	L	O	M
M	O	D	S	I	W	E	Y	C	L	S	M	V
J	W	D	S	T	L	S	B	U	L	X	O	F
X	W	P	C	B	C	S	H	O	Y	B	N	W

WISDOM
OBEDIENCE
BLESSINGS
FAITH
CONTENTMENT
VIRTUES
FOLLY
SOLOMON

పదాలు పట్టుకో

ఇక్కడున్న పదాలు ఈ అక్షర సమూహంలో దాగున్నాయి. వాటిని వెతికి పట్టుకోండి.

జత చేయండి



ఎడమవైపున్న వస్తువుల ఇంగ్లీషు పేర్లలో మొదటి అక్షరాలు పక్కనే కుడివైపు ఉన్నాయి. ఏ వస్తువు ఏ అక్షరంతో మొదలౌతుందో వాటి మధ్య గీత గీయండి

B
A
E
C
K
H

పొడుపు కథలు

1. కిరు కిరు తలుపులు కిటారు తలుపులు వెయ్యంగ వెయ్యస్తవి కాని తియ్యంగ తియ్యరావు. ఏమిటవి?
2. ఎగిరిన ఎగురును పోయిన పోవును నడచిన నడుచును. నోటమాట మాత్రం రాదు. అది ఏదో!
3. కిటకిట బండి కిటారు బండి ఎందరు కూర్చున్నా విరగని బండి ఏది?
4. నాలుగు కాళ్లున్నాయి కానీ జంతువు కాదు. ఏమిటది? రెండు చేతులున్నాయి కానీ మనిషి కాదు
5. పళ్లున్నా నోరు ఏనిది ఏది?

జవాబు : 1. ముగ్గు, 2. నీడ, 3. రైలు, 4. కుర్చీ, 5. రంపం

వాటి పేర్లేంటో

ఇక్కడున్న వాటిల్లో వాసన వచ్చే వస్తువుల పేర్లు రాయండి.

జవాబు : పువ్వు, ఉల్లిగడ్డ, చేపలు, కాఫీ, ఫ్యాక్టరీ పొగ, గులాబి

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి,** ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

కొన్నాళ్ల నుండీ జబ్బుగా వున్న లుడ్విగ్ వాన్ వెస్ట్‌ఫాలెన్ పరిస్థితి డిసెంబర్ 1841 నాటికి క్షీణించింది. ట్రియర్‌కు తిరిగి వచ్చిన మార్క్స్, పెద్దాయనకు సాయంగా వుండటానికి వెస్ట్‌ఫాలెన్ ఇంటికి చేరుకున్నాడు. జెన్నీకి దగ్గరగా వుండవచ్చుననేది మరో ముఖ్య కారణం. మార్క్స్ అక్కడ ఉండగానే ప్రష్యన్ కేబినెట్ మంత్రులు రెచ్చగొట్టే పద్ధతిలో ఒక సెన్సార్‌షిప్ డిక్రీ విడుదల చేశారు. పైకి ఇది రచయితలకు అనుకూలంగానే ఉన్నట్టు కనిపించినా, 1819 నాటి ఆంక్షలను పునరుద్ధరించింది. ఈ కొత్త చట్టం ప్రకారం మత విశ్వాసాలకు వ్యతిరేకంగా, లేదా మతాన్ని, రాజకీయాలనూ కలిపి విమర్శిస్తూ, లేదా వ్యక్తి లేదా గ్రూపులను అపకీర్తిపాలు చేసేదిగా, లేదా మరేదైనా అర్థంలో రెచ్చగొట్టేదిగా ప్రభుత్వం భావించినట్టయితే దాన్ని సెన్సారు చేయటం జరుగుతుంది. అంటే వెలసి అచ్చయిన ప్రతి పదాన్నీ సెన్సారు చెయ్యగలిగే అధికారం సంక్రమిస్తుంది.

వెస్ట్‌ఫాలెన్‌ల ఇంట్లో వున్న కాలంలోనే మార్క్స్ ఈ డిక్రీకి తన ప్రతిస్పందనను సిద్ధం చేసుకున్నాడు. ఫలితంగా, సెన్సార్‌షిప్ చట్టం మీద ఎదురుదాడి ప్రారంభమైంది. మతం ముసుగులో, తాత్వికత ముసుగులో తన రాజకీయాలను దాచే ప్రయత్నం చేయలేదు. నిరసనను సహించని ప్రభుత్వం మీద యుద్ధ ప్రకటన లాంటి వ్యాసంతో తన జర్నలిజం ప్రారంభించాడు మార్క్స్. ఇరవై రెండు పేజీలలో లావా లాగ ప్రవహించింది ఆగ్రహం.

'ఆలోచనలను అణచివేయటానికి చేసిన చట్టం, ప్రజల ప్రయోజనాల కోసం చేసింది ఎంతమాత్రమూ కాదు. ఇది ఒక రాజకీయ పక్షం, తన ప్రత్యర్థి రాజకీయ పక్షానికి వ్యతిరేకంగా చేసిన చట్టం. ఇది ప్రజల్ని విభజిస్తుంది. సమైక్యంగా ఉంచదు. ప్రజల్ని విభజించే చట్టాలన్నీ రియాక్షనరీ చర్యలే. అసలది చట్టం కాదు. ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేయటం మాత్రమే. సెన్సార్‌షిప్ దుష్పరిణామాలను నివారించే పద్ధతి ఒక్కటే. అదే, సెన్సార్‌షిప్‌ను పూర్తిగా ఎత్తివేయటం.

'ఒక రైన్‌లాండ్ నివాసి' పేరున సంతకం చేసిన ఈ వ్యాసాన్ని డ్రెస్డెన్‌లో 'జర్మన్ ఇయర్ బుక్' పత్రికను నిర్వహిస్తున్న ఆర్నాల్డ్ రూగ్‌కు పంపాడు మార్క్స్. మనసులో, మార్క్స్‌కన్నా పదహారేళ్లు పెద్దవాడు రూగ్. ఉదారవాది (లిబరల్) అయిన రూగ్, అతని అభిప్రాయం కారణంగా అప్పటికే ఆరేళ్లు జైల్లో గడిపాడు. ఈ కారణంగానే యూనివర్సిటీలో ప్రమోషన్ కూడా రాలేదు. తన వార్తాపత్రికను ప్రష్యాలో ప్రారంభించినా, అక్కడ దాన్ని నిషేధించటంతో మరోచోటికి తరలించక తప్పలేదు. డ్రెస్డెన్‌లో నిబంధనలు అంత కఠినంగా లేకపోవచ్చు గాని, అక్కడ కూడా అది సెన్సారు అణచివేతకు గురైంది. 1838లో ఒక ముఖ్యమైన ప్రభుత్వోద్యోగం చేస్తున్న ఫెర్దినాండ్ దృష్టి నుండి కూడా ఇది తప్పించుకోలేదు. మార్క్స్ ఇది తన తండ్రి ఇంట్లో ఉన్నప్పుడే రాశాడనేది స్పష్టం.

మార్క్స్ తన వ్యాసాన్ని రూగ్‌కు పంపిన నెల తర్వాత లుడ్విగ్ మరణించాడు. ఆ ఇంట్లో, మార్క్స్ అభిప్రాయాలను గౌరవించిన, సమర్థించిన ఒకే ఒక్క వ్యక్తి అతను. ఇప్పుడు ఇంటి యజమానిగా మారిన ఫెర్దినాండ్.... జెన్నీ, మార్క్స్‌ల ఎంగేజ్‌మెంట్‌ను రద్దు చేయటానికి తీవ్రంగా కృషి చేశాడు. ఈ ప్రయత్నంలో జెన్నీ అంకుల్ ఒకాయన (సాంప్రదాయక భావాలు గల పెద్ద మనిషి) హైనిష్ జార్జ్ వెస్ట్‌ఫాలెన్ కూడా ఆయనతో జతగట్టాడు. జెన్నీ తల్లి కారొలైన్‌కు, కూతురికీ, కార్ల్‌కూ ఏర్పడిన సంబంధం గురించి తెలుసో లేదో గాని, ఆమె జెన్నీని ఫెర్దినాండ్ నుండి దూరంగా క్రూజ్‌నాచ్‌లో వున్న తన ఇంటికి తీసుకునిపోయింది. (ట్రియర్ నుండి యాభై మైళ్ల దూరంలో వుంది క్రూజ్‌నాచ్) అక్కడే, ఇద్దరూ మహిళలూ తుఫాను సమిసిందాకా తలదాచుకున్నారు.

ట్రియర్‌ను వదిలి కొలోన్ చేరుకున్నాడు మార్క్స్. అక్కడ, ప్రష్యన్ ప్రతిపక్షంగా ప్రకటించుకున్న వాణిజ్యవేత్తల క్లబ్బులో సభ్యత్వం తీసుకున్నాడు. మార్క్స్ మిత్రుడు జార్జ్ యంగ్, మరో మిత్రుడు మోజెస్‌హెస్‌లు కలిసి, కొందరు వ్యాపారస్తుల్ని 'రీన్‌లాండ్ గజెట్' పేరుతో ఒకపత్రికకు ఆర్థిక సాయం చెయ్యటానికి ఒప్పించారు. పత్రిక ఆశయం 'రాజకీయాలు, వాణిజ్యం, పారిశ్రామిక అవసరాల కోసం'. దీని అర్థం 'మధ్య తరగతి ప్రయోజనాలు'.

ఈ పత్రికకు నిర్వహణలో యంగ్ హెగెలియన్లతోపాటు సోషలిస్టులు, జాతీయవాదులు, ప్రజాస్వామ్యవాదులు, రకరకాల తీవ్రవాద మేధావులు పాలు పంచుకున్నారు. ఉదారవాద లాయర్లు, డాక్టర్లు, పారిశ్రామికవేత్తలు వెన్నుదన్నుగా ఉన్నారు. భవిష్యత్ ప్రష్యన్ ప్రైమ్ మినిస్టర్ ఆర్థిక మంత్రులు కూడా వీళ్ల పక్షం వహించారు.

ఈ నేపథ్యంలో, మార్క్స్, కొలోన్ చేరుకున్ననాటికి ఆయన వయసు ఇరవై మూడు. అప్పటికి ఒక వ్యాసం ప్రచురితమైంది. మరో ఏడాదిలో ప్రష్యాలోని అత్యంత ప్రభావవంతమైన ప్రతిపక్ష వార్తాపత్రికకు సంపాదకుడు కాబోతున్నాడు.

400 మంది చందాదారులతో జనవరి 1, 1842నాడు ప్రారంభమైంది రైనిష్ జైటుంగ్' (రైన్‌లాండ్ గెజెట్) నాలుగు నెలల తర్వాత ఈ పత్రికకు రాయటం ప్రారంభించాడు మార్క్స్. తన తొలి వ్యాసంలోనే పత్రికా స్వేచ్ఛ గురించి ప్రస్తావించాడు. అప్పటికి రైన్‌లాండ్ పార్లమెంట్‌లో దీని గురించి చర్చ జరుగుతున్నది. ఇది వివాదాస్పదమైన విషయం మాత్రమే కాదు. ప్రాదేశిక చట్టసభల్లో జరిగే చర్చల గురించి రాయటం మీద అప్పటికే నిషేధం ఉన్నది.

అయినప్పటికీ, అన్ని అడ్డంకుల్నీ తప్పించుకుని మార్క్స్ ఆర్టికల్, సెన్సార్లను దాటింది. సంబంధిత అధికార్లకు, మార్క్స్ చేసిన సంక్లిష్ట వాదన అర్థం కాలేదు. అందులోని హాస్య చతురత, సాహిత్య విలువలు అందర్నీ అలరిస్తాయి. ఆయన వాదనకు ప్రాతిపదిక చాలా స్పష్టం. మనిషి మనుగడకు మూలం స్వేచ్ఛ. ఆ స్వేచ్ఛను కాపాడటానికే వుండాలి చట్టాలు.

'స్వేచ్ఛనెవరూ వద్దనరు. కాకపోతే కొందరు కొన్నిసార్లు పక్కవాళ్ల స్వేచ్ఛను అడ్డు తగుల్తారు. అంటే స్వేచ్ఛ ఏదో ఒక రూపంలో ఎప్పుడో వుంది ఒకప్పుడు కొందరికి మాత్రమే. కొన్నిసార్లు సార్వత్రిక హక్కుగా.

మార్క్స్ అభిప్రాయాలను గౌరవించిన, సమర్థించిన ఒకే ఒక్క వ్యక్తి అతను. ఇప్పుడు ఇంటి యజమానిగా మారిన ఫెర్దినాండ్.... జెన్నీ, మార్క్స్‌ల ఎంగేజ్‌మెంట్‌ను రద్దు చేయటానికి తీవ్రంగా కృషి చేశాడు.

స్వేచ్ఛను కట్టడి చెయ్యటానికి చట్టాలు ఉండవు. గురుత్వాకర్షణ సిద్ధాంతం చలనానికి వ్యతిరేకం కాదు! వ్యక్తుల ఇష్టాఇష్టాలను బట్టికాక, అందరికీ స్వేచ్ఛ ఉండేలా చూడటానికే చట్టాలుండాలి. రూల్స్ పుస్తకం అనేది స్వేచ్ఛకు బైబిల్ లాంటిది.

అందువల్ల ప్రెస్ లా వున్నదంటేనే "ప్రెస్సుకున్న స్వేచ్ఛను గుర్తించటం".

ఇదే మార్క్స్ తొట్టతొలి ప్రచురిత రచన. ఆయన ఇరవై నాల్గవ పుట్టినరోజునాడు మే 5, 1842 నాడు వెలుగు చూసింది. అయితే, ఆయన పేరుతో అచ్చు కాలేదిది. మిత్రబృందమంతా పొగడ్తలతో ముంచెత్తింది. పత్రిక ఉప సంపాదకుడు, మోజెస్‌హెస్, మార్క్స్ 'ఈ తరంలోని ఒకే ఒక నిజమైన తత్వవేత్త. గ్రేటెస్ట్' అంటూ ఆకాశానికెత్తాడు. సెన్సార్‌షిప్ మీద ఇప్పటివరకూ వచ్చిన బెస్ట్ ఆర్టికల్ ఇదే' అన్నాడు ఆర్నాల్డ్ రూగ్. 'సూపర్బ్' అన్నాడు యుంగ్.

విజయోత్సాహంతో ట్రియర్‌కు తిరిగి వచ్చాడు మార్క్స్. అయితే, కొలోన్‌లో లాగ, ఇక్కడెవరూ ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తలేదు. అద్భుత మేధో పటిమకు జోహారనలేదు. అసలు, స్నేహపూర్వక వాతావరణమే లేదు. ఇంటకి చేరగానే తల్లితో గొడవపడ్డాడు. తననెవరూ పట్టించుకోవటం లేదనీ, వెస్ట్‌ఫాలెన్‌లు కూడా అంటీముట్టనట్టుగా, దూరందూరంగా వుంటున్నారని ఇర్యాదు చేసిందామె. ఈ గొడవ చినికి చినికి గాలివానగా మారి, చివరకి అక్కడ వున్నన్నాళ్లూ తన సోదరి పెళ్లి తంతు ముగిసిందాకా ఒక గెస్ట్‌హౌస్‌లో గది తీసుకొని వున్నాడు మార్క్స్. తల్లి ఎంత గోలపెట్టినా ఆ కన్నీళ్లేవీ తనను కదిలించలేదు. మనసంతా కొలోన్‌లోని పరిణామాల మీదే లగ్నమై ఉంది.

రైనిష్ జైటుంగ్‌కు ఆదరణ పెరిగింది. దానితో పాటే సంపాదకవర్గానికి చిక్కులూ పెరిగాయి. ఎడిటర్లు తరచుగా మారారు. 1842 వేసవిలో, మార్క్స్ మిత్రుడు అడాల్ఫ్ రూటెన్‌బర్గ్‌ను కొత్త ముఖ్య సంపాదకుడిగా నియమించారు గాని, తాగుడుకు అలవాటు పడిన అతడు ఆ హోదాలో ఎక్కువకాలం కొనసాగే అవకాశం లేదు. పైగా సెన్సారు వాళ్లు కూడా అతడి మీద గుర్రుగా ఉన్నారు.

అప్పటికి అనేక కీలక విషయాల గురించి, ఆణిముత్యాల్లాంటి ఆర్టికల్స్ అనేకం అందులో ప్రచురించాడు మార్క్స్ – అన్నీ వివాదాస్పదమైనవే అయినా, తన ప్రతిభతో అంతరార్థం ప్రభుత్వ దృష్టికి రాకుండా జాగ్రత్తపడ్డాడు. పత్రిక రాడికల్స్ చేతుల్లోకి పోతున్నదని బాధపడ్డ పెట్టుబడిదారులకు అలా జరగదని భరోసా ఇచ్చాడు. సైద్ధాంతిక చర్చలు కాదు. వాస్తవ సమస్యల్ని చర్చించాలి పత్రిక. రాసేవాళ్లకు దారి చూపాలి. అంతేకాని, వాళ్లు చూపిన దిశలో అది ప్రయాణించకూడదు.

అయితే, పత్రికకు కేవలం కరస్పాండెంట్‌గా ఉండదలుచుకోలేదు మార్క్స్. పెట్టుబడిదార్లకు ఆయన అభిప్రాయాలు నచ్చి, అక్టోబర్ 15నాడు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా నియమించారు. ఆ తర్వాత మొదటి రోజునే 'రైనిష్ జైటుంగ్' కమ్యూనిజంను ప్రచారం చేస్తుందన్న ప్రత్యర్థి పత్రిక అభియోగాన్ని తీవ్రంగా ఖండించారు. అప్పటికి కమ్యూనిజమంటే సోషలిజమే అని అందరి అవగాహన. అయితే సోషలిస్టులు ప్రైవేటు ఆస్తిని రద్దు చేయాలంటారు (పత్రిక పెట్టుబడిదార్లందరూ వ్యాపారస్తులే మరి!). కొలోన్ నగరమంతా తిరిగి, దేశంలో ప్రచురించబడిన ఇతర పత్రికలు చదివి, తన పరిచయస్తుల ద్వారా కొన్నిసార్లు దుర్లభమైన సమాచారం కూడా సేకరించి బలమైన వాదనలతో పత్రికలో వ్యాసాలు రాశాడు మార్క్స్. ఆయన సంపాదకత్వంలో, ప్రష్యాలోని ఉదారవాదుల గళంగా మారింది రైనిష్ జైటుంగ్.

మార్క్స్ నాయకత్వంలో దేశంలోని ప్రతిభావంతులైన రచయితలందర్నీ ఆకర్షించింది పత్రిక. అయినప్పటికీ చివరి నిర్ణయం మార్క్స్ మాత్రమే తీసుకుంటాడు. ఈ కాలంలోనే కొందరు తగ్గి 'నియంత' అన్నారు. అతడి అనుమతి లేకుండా, పత్రికలో ఏదీ అచ్చు కావటానికి వీల్లేదు – చివరికి బెర్లిన్‌లోని యంగ్ హెగెలియన్ల వ్యాసాన్నైనా సరే కేవలం పిడివాదం కాదు. హేతుబద్ధత కావాలి. సమాచారం నిక్కచ్చిగా ఉండాలి. వాగాడంబరం కాదు. స్పష్టత సరళత కావాలి. ఆత్మస్తుతి ఉండకూడదు. సహజంగానే తమను తాము స్వేచ్ఛా మేధావులమని చెప్పుకున్న యంగ్ హెగెలియన్ల మార్క్స్‌ను 'కన్సర్వేటివ్'గా ముద్రవేశారు. 'ఈ వాగుడుకాయల నిందలనైనా భరిస్తాను గాని పత్రిక విశ్వసనీయతను మాత్రం త్యాగం చెయ్యను' అన్నాడు మార్క్స్.

మార్క్స్ పత్రికా సంపాదకుడిగా నియమింపబడటానికి ఒకరోజు ముందు అక్టోబర్ 14నాడు ఇరవై మూడేళ్ల సోదరుడు హెర్మాన్ మరణించాడు. అయినా మార్క్స్ అంత్యక్రియలకు హాజరైనట్టుగా దాఖలా లేదు. కొలోన్‌లో, కూర్చుని తన ముందున్న రెండు వ్యాసాల గురించి తీవ్రంగా ఆలోచించాడు మార్క్స్ ఆ తర్వాత వీటి గురించే మాట్లాడుతూ 'రాజకీయాల నుండి ఆర్థిక విషయాల వైపు అంటే సోషలిజం వైపు మళ్లటానికి ఇవే కారణం' అని తర్వాతి రోజుల్లో ఎంగెల్స్‌తో చెప్పాడు. తన పరిశోధనల ద్వారా మరో విషయం కూడా గ్రహించాడు. వ్యక్తుల మధ్య సంబంధాలు మౌలికంగా భౌతికమైనవే అంటే ఆర్థిక పునాది మీద ఏర్పడినవే.

ఆ రెండు వ్యాసాలలో మొదటిది : ప్రైవేటు అడవుల్లో రైతులు కలప ఏరుకోవటం గురించి. ప్రష్యన్ ప్రభుత్వం ఇటీవలే ఈ చర్యను దొంగతనంగా ప్రకటించింది. తరతరాలుగా నిరుపేదలు అడవుల్లో పడివున్న కలపను సేకరిస్తూనే వున్నారు. ముఖ్యంగా చలి కాచుకోవటానికి. 1807లో అర్ధబానిస వ్యవస్థ రద్దయిన తర్వాత కూడా ఇది కొనసాగింది. కాని 1840 నాటికి, పరిశ్రమల వాళ్లు ఈ కలప భూస్వాముల వద్ద మంచి ధరకు కొంటామన్నారు. ప్రభుత్వం, భూస్వాములకు (ప్రభుత్వంలోని అన్ని హోదాలలో వున్నది వీళ్లే) వత్తాసు పలికింది. పేదల వలస సేకరణను నేరంగా పరిగణించింది. మార్క్స్ దీని గురించి రాసేనాటికి 'దొంగతనాలు' ఎంతగా పెరిగాయంటే ప్రష్యాలోని ఆరింట అయిదు వంతుల కోర్టు కేసులు ఇవే. ప్రకృతి వరంగా ఇచ్చినదాన్ని భూస్వామి అమ్ముకుంటున్నాడని అభిశంసించాడు మార్క్స్. ఈ కొత్త చట్టం, ఎంతగా భూస్వాములకు వత్తాసు పలుకుతున్నదంటే, ఈ కలప దొంగల వల్ల పాపం భూస్వామికి చలి కాచుకోవటానికి కలపే మిగలటం లేదు' అని చురక అంటించాడు.

పత్రికకు కేవలం కరస్పాండెంట్‌గా ఉండదలుచుకోలేదు మార్క్స్. పెట్టుబడిదార్లకు ఆయన అభిప్రాయాలు నచ్చి, అక్టోబర్ 15నాడు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా నియమించారు. ఆ తర్వాత మొదటి రోజునే 'రైనిష్ జైటుంగ్' కమ్యూనిజంను ప్రచారం చేస్తుందన్న ప్రత్యర్థి పత్రిక అభియోగాన్ని తీవ్రంగా ఖండించారు.



రెండవ వ్యాసం, జర్మన్ రాష్ట్రాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యమూ, సరుకుల మీద పన్నులు వేసే విధానమూ ఉండటం వల్ల మోసెల్ ద్రాక్ష తోటల పెంపకం దార్ల పేదరికంలో మగ్గిపోవటం గురించి. రైనిష్ జైటుంగ్‌లో పెట్టుబడి పెట్టిన వ్యాపారస్తులకు స్వేచ్ఛా వాణిజ్యం లాభసాటిగానే కనిపించింది. దీనివల్ల తమ మార్కెట్లు పెంచుకునే అవకాశముంది. కాని మార్క్స్‌కు తెలుసు. చిన్న రైతుల పొట్టగొడితే తప్ప పెద్ద రైతులు లాభాలు గడించరు. పెద్ద రైతుల మార్కెట్లో, చిన్న రైతులు పోటీని తట్టుకుని నిలబడలేరు.

తన పత్రిక పాఠకులు కూడా ఎక్కువమంది మధ్యతరగతి వాళ్లే. అందరూ స్వేచ్ఛా వాణిజ్యాన్ని సమర్థించేవాళ్లే. ఇలా రాయటం పత్రిక వాటాదారులకు నచ్చదు. అంటే తన ఉద్యోగానికే ముప్పు రావచ్చు. అయినప్పటికీ రైనిష్ జైటుంగ్' అతిత్వరలో రాడికల్ ధోరణిని ప్రదర్శించింది. రైన్‌లాండ్ పార్లమెంట్ చర్చల్నీ, బెర్లిన్‌లోని ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించింది. అయితే, విషయ విశ్లేషణలో అందులోని వ్యాసాలనెవరూ తప్పు పట్టలేదు. మొదటి సంవత్సరంలోనే నాలుగు వందల నుండి మూడు వేల అయిదు వందలకు పెరిగాయి చందాలు. ఎంత ఘాటుగా రాసినా సెన్సార్ల చేతుల నుండి జారిపోతూనే ఉన్నాయి వ్యాసాలు. అయితే, పత్రికకు రాసేవాళ్లతో మార్క్స్‌కు చికాకు తప్పలేదు. వాళ్లు సైద్ధాంతికంగా రాస్తారు. లేదా అభిప్రాయాలు ప్రచారం చేస్తామంటారు. కేవలం వాస్తవ విషయాలు మాత్రమే రాయలంటాడు మార్క్స్.

(సశేషం)

■ స్కెచ్

మళ్ళీ కందిలీ ముట్టిద్దాం!

నాలుగో అంతస్థులో ఏకాంత ధ్వాంతాన ఒక్కళ్ళమే హాయిగా ఉండొచ్చని పెంట్‌హౌస్ కొన్న పాపానికి రాత్రి తొమ్మిదిగంటల వేళ మెట్లు ఎక్కివచ్చాక కనిపించిన దృశ్యం సైదయ్యని అబ్బురపరిచింది. కొన్ని క్షణాల్లోనే అలసట తీరిపోయినట్టనిపించింది.

కందిలీ వెలుగులో ఏడో తరగతి చదువుతున్న అబ్బీకి, నాలుగో తరగతి చదువుతున్న అమ్మీకి హోంవర్కు చేయిస్తున్న సుమిత్రని చూసి క్షణంలో నోస్టాల్జియాలోకి వెళ్ళిపోయాడతడు.

"మీకు సంబరంగా వున్నట్టుంది– రాత్రంతా కరెంటు లేకపోతే పిల్లలు ఎలా నిద్ర పోతారు... రేపు పరీక్షలు ఎలా రాస్తారని ఆలోచించరేం"

"సుమీ...ఎన్నాళ్ళకెన్నాళ్ళకు చూశా. కందిలీ వెలుగులో పిల్లలు చదువుకోడం... నా చిన్నప్పటి రోజులు గుర్తుకు వస్తున్నాయే" అన్నాడు పట్టలేని ఆనందంతో.

"మీకు భలే వున్నట్టుందే... పిల్లలకి రేపు అసలే ఎగ్జామ్. ఎసైన్‌మెంట్ కంప్లీట్ చేయకపోతే కష్టం. అందుకే మీరు అలంకారంగా ఆ మూలకుపెట్టిన కందిలీలో కిరోసిన్ పోసి ముట్టించా" అంది సుమిత్ర.

"ముట్టించడం ఏంటమ్మా" అన్నాడు అబ్బీ తలెత్తి చూస్తూ.

"అదేరా... కందిలీ వెలిగించడం" చెప్పిందామె.

"కందిలీ వెలుగులో కనిపిస్తుందా అమ్మీ" అంటూ పాప చెంత చతికిలపడ్డాడు.

"కష్టంగా వుంది నాన్నా" అంటూ గారాలు పోయారిద్దరు.

"నాలుగురోజులు ఇలా చదివితే అలవాటవుతుంది లెండ్రా... మీ అయ్య దీపం బుడ్డి వెలుగులో చదివి కాలేజీ ఫస్టు వచ్చాడో తెలుసా" అంది సుమిత్ర నవ్వుతూ.

"అవునర్రా... అప్పట్లో వీధిదీపాల కింద చదువుకొని గొప్పోళ్ళయిపోయారని చెప్పుకునేవారు... మీరు స్కూల్ ఫస్టు కాదు గానీ, క్లాసు ఫస్టు వస్తే మా పిల్లలు కందిలీ వెలుగులో చదువుకొని ఫస్టు మార్కులతో పాసయ్యారని అపార్ట్‌మెంటంతా చెప్పుకుంటుంది మీ అమ్మ" తను నవ్వుతూనే అన్నాడు.

"భలే భలే... ఈ అయిడియాలే పేపర్లో రాయండి. కెసిఆర్ ప్రతి ఇంటికో బల్బు లాగా, ప్రతి ఇంటికో కందిలీ అయినా సరఫరా చేస్తాడు" అంది గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చిన సుమిత్ర. మరో చేత్తో విసనకర్ర ఇచ్చి "గాలి ఆడటం లేదు. కాస్సేపు పిల్లలకు ఊపండి. పావుగంటలో హోం వర్కు అయిపోతుంది" అని ఆర్డర్ జారీ చేసి మరో గదిలోకి వెళ్ళిందామె. పిల్లలకు చల్లని వింజామర లాంటి విసనకర్రని ఊపుతూ ఆలోచనల్లోకి జారిపోయాడు సైదయ్య.

చరిత్రలో ఏదీ పూర్తిగా అంతరించిపోదని, దాని అవశేషాలు ఎక్కడో చోటా ఉనికిలో ఉంటాయని సుప్రసిద్ధ చరిత్రకారుడు డి.డి.కోశాంబి చెబుతారు. మళ్ళీ కందిలీ వెలిగించే కాలం రావడాన్ని చూస్తే అలాగే అనిపించిందతనికి.

కందిలీ వెలుగులో చదువుకోవడం ఒక నోస్టాల్జియాగా మిగిలిపోతుందనుకున్నాడు గానీ మళ్ళీ దానిని ముట్టించే రోజులు వస్తాయని ఊహించలేదు. శిల్పారామం విలేజీ మ్యూజియంలో కనిపించే కందిలీ ఇక తెలంగాణలో ఇంటింటా దర్శనమిచ్చే రోజులు రానున్నాయేమో! బ్యాటరీ లైట్లు ఉండగా కందిలీ అవసరం ఏమిటనే ప్రశ్న రావచ్చు. ఏమో! బ్యాటరీ చార్జింగ్‌కు కూడా కరెంటు దొరకని కష్టాలు దాపురిస్తే ఆముదం దీపాలు, కిరోసిన్ దీపాలు, దేవుని ముందు ప్రమిదల్లో నూనె పోసి వెలిగించే దీపాలే శరణ్యం కావచ్చు.

ఎనకటికి కలిగినోళ్ళ ఇళ్ళలో గ్రామ్‌ఫోన్లు అలంకారంగా వుండేవి. అలాగే కొందరు తెలంగాణ సృజనకారులు కందిలీని ఒక చూడముచ్చటయిన అలంకారంగా ఒక మూలకు కుదురుగా వుంచేవారు. ఇంకొందరు జ్ఞాపకంగా వుంటుందని అటక మీద దాచుకున్నవాళ్ళు వున్నారు. ఆ రూపంలోనైనా దాచుకోవడం మేలే అయిందని తలపోసే రోజులు వచ్చాయి మరి. కరెంటు లేని కాలంలో నోస్టాల్జియాగా వున్న కందిలీ ఒక పెద్దదిక్కయింది. దానిని మరల తీసి తుడిచి పెట్టడం తప్పనిసరి అవసరమయ్యింది.

ఆశ్వయుజ మాసం పౌర్ణమి రాత్రి చంద్రుని వెన్నెల్లో భోజనం చేయడమే కాదు, రాత్రంతా వెన్నెల స్నానాలు చేసే అవకాశమూ వచ్చింది. "బయట ఆరుబయట వెన్నెల్లో భోజనం చేద్దాం సుమీ" ప్రేమగా చెప్పాడు.

"మీకు సంబరంగా వున్నట్టుంది– రాత్రంతా కరెంటు లేకపోతే పిల్లలు ఎలా నిద్రపోతారు... రేపు పరీక్షలు ఎలా రాస్తారని ఆలోచించరేం" విసుగ్గా అంది.

"డిగ్రీవరకు మా ఇంట్లో కరెంటే లేదు తెలుసా..." రోషపడ్డాడు సైదయ్య.

"తెలుసు... తెలుసు... డిగ్రీకొచ్చాక పరీక్షలప్పుడు రాందాస్ ఇంటికెళ్ళి డాబా మీద చదువుకోడం కూడా తెలుసు... అయినా ఎన్నాళ్ళీ అవస్థ?"

ఆమె ప్రశ్నకు అతని దగ్గర జవాబు లేదు. మంత్రులకు మాదిరిగా మాటలు చెప్పి తప్పించుకునే తెలివి అస్సలు లేదు. మాటలతో అయ్యే పని

కాదు. మౌనంగా ఆలోచనల్లోకి జారుకున్నాడు.

కరెంటు లేని రోజులు... ఆ రోజుల్లో ఊళ్ళలో కరెంటు ఎక్కడిది... అంటూ నాయిన చెప్పే ముచ్చట్లు గుర్తుకొచ్చాయి. 1956కి ముందటి తెలంగాణ కావాలన్న కల ఈవిధంగా నెరవేరుతుందా!

కరెంటు లేని రోజులు... బడి లేని రోజులు...

"మా ఊళ్ళో ఇరవై మంది పిల్లలమే... ఒక అయ్యవారు ఇసుకలో అక్షరాలు రాసి నేర్పేవాడు. ఎక్కాల పుస్తకం, పెద్దబాలశిక్ష చెప్పేవాడు... దొరవారి పిల్లలకు చెప్పడానికి గడీకి వెళ్ళేవాడు. కరణం గారి ఇంటి అరుగే ఊళ్ళో వున్న పిల్లలకు బడి... చీకటయిందంటే ఏడు గంటలకల్లా ఊళ్ళో మనిషి కనిపించేవాడు కాదు..." ఒక్కొక్కటిగా నాయిన చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి సైదయ్యకి.

'అవును... ఇరవై మంది మాత్రమే చదివే చోట బడి ఎందుకు, టీచర్లు ఎందుకు అంటున్నారు...' నిజంగా ఊళ్ళో బడి లేని కాలం మళ్ళీ దాపురిస్తుందా?

వాట్ ఏ పిటీ... 1956కి ముందటి తెలంగాణ... అంటే ఇట్లాంటి తెలంగాణ కోసమా ఇన్నేళ్ళు కింద మీదా పడి పోట్లాడింది...

"ఏంది ఏమో చించుతున్రు... లేవండ్రి... కాళ్ళు చేతులు కడుక్కుని రాండ్రి... బువ్వ తిందురు కాని..." చీకటిగూడెం యాసలో పలికింది సుమిత్ర.

"చీకటిగూడెం కారం పెట్టవు కదా చీకట్లో... " నవ్వుతూ లేచాడు సైదయ్య.

"అయ్యవారికి చిన్నప్పుడు సద్దన్నంలోకి కారం తిన్న రోజులు గుర్తు చేద్దామని... ఉల్లిగడ్డ కారం, జొన్నరొట్టెలు చేశా" కారిడ్డమాడింది సుమిత్ర.

"చీకటి ఇంట చీకటిగూడెం అమ్మాయి తెలంగాణరుచులు వడ్డించే ఈ రేయి మరల మరల రాదోయి..." గాత్రం సవరించాడు.

"మరల మరల ఏంటి... నిత్యమూ నిరతమూ చీకట్లో ఉల్లిగడ్డ కారమే మీకు బెస్ట్" అంటూ నవ్వింది.

ఆ మాటకు బదులు చెప్పలేక... చీకట్లో మెరిసిన ఆమె పలువరుసను మురిపెంగా చూస్తూ చీకట్లో తడుములాడుకుంటూ స్నానాల గది వైపు నడిచాడు సైదయ్య.

- జీవి

రచయితలకు సూచనలు

✎ 'సోపతి' కోసం వ్యాసాలు, కథలు, కవితలు పంపించండి.

✎ కథకు పేజీల పరిమితి లేదు. కథ అయి వుండాలి, అంతే! చదివించే గుణమే ప్రధానం.

✎ అనువాద కథ, కవితలు కూడా పంపించవచ్చు. మూల రచయిత అనుమతి పత్రం తప్పనిసరి.

✎ యాత్రా కథనాలకు ప్రత్యేక ప్రాధాన్యం. మీరు చూసి వచ్చిన ప్రదేశాల గురించి, మీ అనుభవ నేపథ్యంలో రాసి, తగిన ఫోటోలతో పంపించండి.

✎ రచనల్ని తిప్పి పంపాలనుకునేవారు తగిన స్టాంపులున్న కవర్‌ని జత చేయాలి.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

నా పాట ■

తరాలు మారినా చెదరదు మా యువతరం

పల్లవి :
తరాలు మారినా చెదరదు మా యువతరం
ప్రాణాలు పోయిన ఆగదు ఈ నవతరం
ఉదయించే సూర్యునిలా వెలుగు దివ్వెలవుతాము
భగ భగ మండే మంట నిప్పురవ్వలవుతాము ॥తరాలు॥

చరణం 1 :
ఆకలితో అలమటించే అనాథలకు అండగా
అణగారిన నిరుపేదల కన్నీరును తుడవగా
నిరుద్యోగ యువతకు నిట్టూర్పునివ్వ
ముందుకు మునుముందుకు సాగిందే యువతరం ॥తరాలు॥

చరణం 2 :
ఉరికంబమే ఊపిరిగా భావించిన భగత్‌సింగ్
రాజ్యాంగ అధినేత బాబా అంబేద్కరుడు
అహింసతో పోరాడి గెలిచిన ఆ మహాత్ముడు
స్వాతంత్ర్య సమరయోధులానాడు సైనికులే ॥తరాలు॥

చరణం 3 :
భరతమాత భద్రతకి ప్రాణమిచ్చే మిలిటరీ
ప్రజల మాన ప్రాణాలు కాపాడే పోలీసు
అన్యాయాన్ని అరికట్టే అదృశ్యపు సోదరులు
అందరు వీరందరు ఇంకెందరో సైనికులే ॥తరాలు॥

చరణం 4 :
సాధించిన స్వాతంత్ర్యము ఎక్కడ దాగుందిరా
ఈ నాయకుల వాగ్దానాలెక్కడ నశియించెరా
సాగిలపడి మొక్కనీకి బానిసలము కాదురా
ఈ సమస్యల్ని రూపుమాపే సైనికులం మేమురా ॥తరాలు॥

- స్వామి ఇల్లందుల

■సృజన 1926లో నోబెల్ సాహిత్య బహుమతికి ఎవరూ అర్హతపొందలేదని, అదే బహుమతిని 1927లో, ఇటలీ దేశపు రచయిత్రి, నవలాకారిణి గరాజ్సీ డేలెడ్డాగా పిలవబడే, గరాజ్సీ మారియ కోసిమ డమియన డేలెడ్డాకు ప్రదానం చేశారు. ఇటలీ నుండి నోబెల్ బహుమతి పొందిన మొట్టమొదటి మహిళ ఈమె. ఇటలీలో సాహిత్యానికి నోబెల్ బహుమతి పొందిన వారిలో డేలెడ్డా రెండవ వారు. అంతకు ముందు జివోసుయే కార్డుచ్చీ (1835–1907)కు, 1906లో ఈ బహుమతి లభించింది. సాహిత్యానికి ఈ బహుమతి పొందిన మహిళల్లో కూడా, సెల్మా లోగెర్లోఫ్ (1858–1940) తరువాత, ఈమె రెండవవారు.

'మధ్య ప్రాచ్యంలో రెండవ అతిపెద్దదైన, ఆమె పుట్టిన ద్వీపం సర్దీనియా జీవితం మీద సానుభూతితో లోతుగా ప్రధానంగా మానవ సమస్యల గురించి, మృదువైన స్పష్టతతో ఆదర్శపూర్వకంగా ప్రేరణ కలిగించే రీతిలో వీరి లేఖనం చిత్రిస్తుంది' అని నోబెల్ బహుమతి ప్రదాతలు డేలెడ్డా గురించి చెప్పుకున్నారు.

జీవితంపై ప్రేమని పెంచే గరాజ్సీ డెలెడ్డా

డేలెడ్డాది మధ్య తరగతి కుటుంబం. ఆమె తండ్రి గియొవన్ని ఆంటోనియొ డేలెడ్డా, తల్లి ఫ్రాన్సెస్కా కంబొసు. ఇటలీ ఏకీకరణోత్సవ మొదటి సంవత్సరమే ఆమె పుట్టారు. వీరు పుట్టిన ఊరిని, కాంస్యయుగ గ్రామం అని ఆమె ఆ తరువాత చెప్పుకున్నారు. తండ్రి కవిత్వం రాసేవారు. కొన్నాళ్లు మేయరుగా కూడా ఉన్నారు. దగ్గరి అడవులు, గుహల నుండి వచ్చి బీభత్సం సృష్టించే, బందిపోట్లను తెలుసుకునేందుకు వీలుగా ఎత్తైన కొండమీద వీరి ఇల్లుండేది. ఆ ఇల్లు సంచారులకు, మిత్రులకు తలదాచుకునేందుకు పనికొచ్చేది. అక్కడకు చేరుకునేందుకు గుర్రం ఉపయోగపడేది. చలికాలాలు న్యూరోలో చాలా దారుణంగా ఉండేది, తిండికి కూడా ఏమీ దొరికేవి కావు. ఆ చలికి తట్టుకోలేక వీరి చెల్లి మరణించింది.

డేలెడ్డా జీవితం గురించి చెప్పుకున్నే ముందు చూద్దాం–" సర్దీనియాలోని ఒక చిన్న పట్టణం న్యూరోలో 1871లో నేను జన్మించాను. మా తండ్రి మంచి సంపన్న భూస్వామి. ఆయన అతిథి సత్కారం కూడా చేసే మనిషి. న్యూరో పట్టణానికి పరిసర పట్టణాలన్నింటిలో వారికి స్నేహితులు ఉండేవారు. వ్యాపార నిమిత్తం లేదా మత సంబంధమైన సెలవుల్లోనో, ఆ స్నేహితులు, వారి కుటుంబాలు, న్యూరోకి వచ్చినపుడు, వారు సాధారణంగా మా ఇంటిలోనే ఉండేవారు. మా కుటుంబంలో సాహసవంతులు, పురాతన కళాకారులూ ఉన్నారు. మంచి పేరు గౌరవంతో పాటు మాకు వేరుగా సొంత గ్రంథాలయం ఉండేది. నా నవలల్లో అనేక పాత్రల్ని, వీటన్నింటి మూలంగా తెలుసుకోవడం మొదలయింది. నేను న్యూరోలో ప్రాథమిక పాఠశాలకే వెళ్లాను. ఆ తరువాత ఇటలీలో ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుని దగ్గర సొంతంగా పాఠాలు నేర్చుకున్నాను. ఆయన నాకు రాయడానికి ఇతివృత్తాలిచ్చేవారు. అవి కథలుగా మలిచిన వాటిల్లో కొన్ని, ఎంత బాగా వచ్చాయంటే, వాటిని వార్తాపత్రికలో ప్రచురించమని వారే చెప్పారు. 13 ఏళ్లకు నేను రాయడం మొదలు పెట్టాక ఆడపిల్లను, గనుక నన్ను ఇంటివారు అడ్డుకున్నారు. ఆ 13 ఏళ్లపుడు నా కథలు ప్రచురించబడాలంటే ఎవరి దగ్గరకు వెళ్లాలో నాకు తెలియదు. కానీ ఒక నాగరిక పత్రిక చూసి దాని చిరునామా తీసుకుని ఒక కథ పంపించాను. అది వెంటనే ప్రచురించబడింది. ఆ తరువాత నా మొదటి నవల 'సర్దీనియా పుష్పం' రాశాను, అది రోమ్ లో ఒక సంపాదకుడికి పంపాను. అది ఆయన ప్రచురించాడు. మంచి ప్రజాదరణ పొందింది అది. కానీ నా నిజమైన విజయం 1903లో వచ్చిన 'ఎలీన పోర్టోలు' నవల. అది అనేక యూరోపియన్ భాషల్లోకి అనువాదమయింది. ఆ తరువాత నేను విస్తృతంగా రాశాను.

1900లో మొదటిసారి సర్దీనియా రాజధాని కాగ్లియరికి వెళ్లాను. అక్కడే నా భర్త, పల్మిరొ మదెసని కలుసుకున్నాను. నేను ప్రస్తుతం ఉంటున్న రోమ్‌కు వెళ్లిపోయాము. సంకలనం రూపంలో పెట్టని కొన్ని కవితలు కూడా నేను రాశాను."

డేలెడ్డా జీవితం గురించి వారు చెప్పనిది కొంత ఇది– "17 ఏళ్ల ప్రాయంలో ఉల్టిమ మోడ (రోమ్‌లోని ఒక ఫేషన్ పత్రిక)లో ప్రచురించబడ్డ మొదటికథ 'సర్దీనియా రక్తం'లోని కథ, ఇది ఆమె కుటుంబానికి అనేక చిక్కులు తెచ్చిపెట్టింది. అందమైన యువతి ఈలా, తన సోదరి ప్రేమికుడ్ని కొండ శిఖరం నుండి తోసేయడం ఆ కథ. ఆ కథతో ఆ పూర్తి గ్రామం అంతా తిరగబడ్డారు. దానితో కొన్నాళ్లు మారుపేరుతో రచనలు చేశారు. అయినా ఆ చుట్టుపక్కల వారు దాన్ని పసిగట్టే వారు. కారణం, చాలా వరకూ అవి వారి కథలే. వారికి అర్థం కానిదల్లా అవి వారి పట్ల సహానుభూతితో రాసినవే తప్ప, వారిని అభాసుపాలు చేయాలని కాదు. 1892లో తండ్రి మరణించారు.

డేలెడ్డా అక్క, ఒక ప్రేమికుని ద్వారా మోసపోయి, తన వివాహానికి ముందు తనువు చాలించింది. సోదరుడు విలాస జీవితం కోసం దొంగతనాలు చేసేవాడు, ఫలితంగా జైలు జీవితం అనుభవించే వాడు. మరో సోదరుడు కూడా, చేసిన ప్రయోగాలు విఫలమైనాక,

వేశ్యాలోలత్వానికి, తాగుడుకు బానిసై మరణించాడు. వీటిని తట్టుకోలేక తల్లి కూడా క్షీణించి మరణించింది. మిగిలిన తాను అన్నింటినీ తట్టుకుని వివాహం చేసుకుని రోమ్ నగరానికి మకాం మార్చింది."

అసహ్యం కలిగించే తోబుట్టువుల్లా కాక, డేలెడ్డా మంచి నడవడికతో పెరిగింది, క్రమం తప్పకుండా రోజుకు కనీసం నాలుగు పేజీలైనా రాస్తూ, 44 పుస్తకాలు వెలువరించారు. ప్రకృతి ప్రేమతో, సానుభూతి హాస్యంతో కూడి, అప్పుడప్పుడు సంభవించే హింసను కూడా స్పర్శిస్తూ సాగే, కవిత్వరూపంలో ఉండే వచనం ఆమెది. ప్రేమ, పాపం, కుటుంబం ఈ రచనల్లో ప్రధానాంశాలు. పునరావృతమయే ఇతివృత్తాల్లో-పురాతన ఆధునిక మార్గాల మధ్య సంఘర్షణ, దురాకర్షణకు లొంగుబాటు మూలంగా వచ్చే విషాదాంత పరిణామాలు, అనాగరిక మూఢవిశ్వాసాలు, సర్దీనియాలోని జీవితం-ఎక్కువగా కనిపించే అంశాలు.

పాఠశాలల్లో చేర్చకముందు డేలెడ్డా మావయ్య, మతాచార్యుడు సెబాస్టియనో కంబొసు, ఈమెకు చదవడం రాయడం నేర్పించారు. పాఠశాలల్లో 11 ఏళ్లవరకే చదువుకున్నారు. ఆడపిల్లలకు చదివిన ఆ నాలుగేళ్లే చాలనుకున్నారు చదువుకున్నదంతా తనకు తానే పెద్దగా చదువుకోకపోయినా, తనచుట్టూ ఉండే ప్రాకృతిక పరిసరాల, రైతు జీవితాల ప్రేరణతో, యవ్వనం తొలిదశలోనే రచనలు చేయడం మొదలుపెట్టారు. మాతృభాష సర్డోనే అయినా, నేర్చుకున్న ఇటలీ భాషలో రచనలు చేశారు. 15 ఏళ్ల ప్రాయంలో మొదటి కథ 'సర్దీనియా రక్తం రాసారు, 17 ఏళ్లపుడు మొదటి నవల 'ఫెర్నాండా జ్ఞాపకాలు,' 19 ఏళ్ల ప్రాయంలో మొదటి కథా సంకలనం, 21 ఏళ్ల ప్రాయంలో 'సర్దీనియా పుష్పం' నవల వచ్చింది. సర్దీనియా పుష్పంతో మంచి పేరు వచ్చింది. బహుశా మరొక గొప్ప నవల-ఎలీస్ పోర్టోలు.

డేలెడ్డా నవలల్లో - 1905లో 'విడాకుల తరువాత', 1908లో 'బూడిద', 1913లో 'గాలి గొట్టాలు', 1920లో 'అమ్మ', 1925లో 'ఈజిప్టు లోకి పలాయనం' - మొదలైనవి చెప్పుకోదగ్గవి. వీటిల్లో 'అమ్మ' నవల బాగా ప్రసిద్ధి పొందిన నవల ఒక సర్దినియా తల్లి కొడుకు అందమైన వితంతువుతో ప్రేమలో పడడం కథాంశం ఇందులో. 'బూడిద' నవల - ఒక స్త్రీ తన అక్రమ సంతానమైన కొడుకుని, వాడి మంచి బతుకుకోసం వదులుకోవడం కథాంశం - అది ఇటలీలో చలనచిత్రమైంది.

లేత వయస్సులోనే 1900లో వివాహం కావడంతో ఇటలీలోని రోమ్ నగరానికి తరలివెళ్లినా, ఊహాత్మక స్వీయచరిత్రలా సర్దీనియాలోని కఠోరమైన జీవితాన్ని చిత్రిస్తూ రాసే ప్రవృత్తిని డేలెడ్డా మానుకోలేదు. ఎక్కువ భాగం నవలలు, అక్కడి నైతిక నియమాల్ని, సామాజిక విలువల్ని విమర్శించినా, వాటిమూలంగా బాధితులైన ప్రజల్ని విమర్శించలేదు.

డేలెడ్డా వారంలో ఏడు రోజులూ అదే దినవారీ కార్యక్రమాన్ని కొనసాగించారు, కాస్త ఆలస్యంగా ఫలహారం, కొన్ని గంటలు చదువుకోవడం, మధ్యాహ్న భోజనం తరువాత కాసేపు నిద్ర, ఆ తరువాత కొన్ని గంటలు రాసుకోవడం. రాత్రి భోజనం సరికి, ఆ రాసింది కనీసం నాలుగు పేజీలయేది.

నోబెల్ బహుమతి స్వీకరించేందుకు డేలెడ్డా స్టాక్ హోం వెళ్లినపుడు, ఆదరపూర్వంగా కలిసిన వారిలో, ఆ తరువాత 1931లో నోబెల్ బహుమతి పొందిన ఎరికీ ఎక్సెల్ కార్ల్ ఫెల్ట్ కూడా ఉన్నారు. డేలెడ్డా బహుమతి స్వీకార ప్రసంగం, అటువంటి ప్రసంగాల చరిత్రలో అత్యంత సంక్షిప్తమైనది.

ఇటలీని అనేక సంవత్సరాలు పాలించి, అనేకమంది దేశవాసుల్ని, డేలెడ్డా మిత్రుల్ని సైతం కారాగారవాసం చేసిన, నియంతృత్వ పరిపాలకుడు బెనిటో ముస్సోలిని, ఆమెకి నోబెల్ బహుమతి రావడాన్ని స్వాగతించాడు. బహుమతి స్వీకరణ తరువాత ఇటలీ ఆధికారిక ఉత్సవంలో, 'అత్యంత ప్రశంసా పూర్వకంగా' అని రాసి, సంతకం చేసిన అతని ఉత్తరువుని అంగీకరించాలన్న షరతుతోనే బహుమతి తీసుకునేందుకు సమ్మతిస్తానన్న ఒత్తిడికి అంగీకరించక తప్పలేదామెకు.

నోబెల్ బహుమతి పొందిన తరువాత కూడా డేలెడ్డా విస్తృతంగా రచనలు చేసారు. 1930లో 'కవి గృహం', 1933లో 'వేసవి సూర్యుడు', ఈ రెండు కథా సంకలనాలూ, వారి అత్యంత బాధాకరమైన నయంకాని జబ్బులో ఉండి కూడా రాసినవి. అవి జీవితం పట్ల వారి ఆశావహ దృక్పథాన్ని తెలియజేస్తాయి. చివరి రచనల్లో సాధారణంగా వుండే ప్రత్యేకత-మానవాళిమీద, దేవుని మీద అచంచల విశ్వాసం కనిపిస్తాయి.

సిసిలియన్స్ లుయిగి కపువన (1813-1915), గియొవన్ని వెర్గా (1840-1922) మొదలైన ఇటలీ రచయితల ప్రభావం డేలెడ్డా మీద

17 ఏళ్ల ప్రాయంలో ఉల్లిమ మోడ పత్రికలో ప్రచురించబడ్డ మొదటికథ 'సర్దీనియా రక్తం'. ఇది ఆమె కుటుంబానికి అనేక చిక్కులు తెచ్చిపెట్టింది. అందమైన యువతి ఈలా, తన సోదరి ప్రేమికుడ్ని కొండ శిఖరం నుండి తోసేయడం ఆ కథ. ఆ కథతో ఆ గ్రామంలో అంతా తిరగబడ్డారు.

ఎక్కువ. అందులో వెర్గా దాదాపు ఆరాధ్యుడు. నోబెల్ బహుమతి తనకంటే వెర్గాకి రావల్సిందని అభిప్రాయపడ్డారు. మొదటి ఇటలీ నవలాకారుడు నెస్టర్ అలెస్సండ్రో మంజొని (1785-1873), క్షీణ దశ రచయిత ఒగొటర్చెట్టి (1839-1869), మనస్తత్వం, అధిభౌతిక శాస్త్రం రచనల్లో ఎక్కువగా పొందుపర్చే రచయిత అంతొనియొ ఫొగజ్రా **(1942-1911)** ఆమెను ప్రభావితం చేసిన ఇతర ముఖ్య రచయితలు.

1903-1920 మధ్య, మంచి పేరొచ్చే రచనలు డేలెడ్డా చేశారు. 'ఎలీస్ పోర్టోలు' నవలలానే 1908లో వచ్చిన, 'బూడిద' నవల కూడా అనేక భాషల్లో అనువాదమయింది. 1920లో వచ్చిన అమ్మ నవల ఆంగ్లంలో 'స్త్రీ-పూజారి' గా అనువాదమయింది, దానికి ప్రసిద్ధ ఆంగ్ల రచయిత డి.హెచ్ లారెన్స్ ముందుమాట రాశారు.

రొమ్ము పుట్టకురుపు వ్యాధితో 15 ఆగస్టు 1936న, రోమ్ లోనే డేలెడ్డా మరణించారు. ఆమెకి ఇద్దరు కుమారులు. నోబెల్ బహుమతి స్వీకారోత్సవంలో వేసుకున్న దుస్తువులతోనే వారిని సర్దీనియాలో ఖననం చేసారు. 1937లో ప్రచురించబడ్డ చివరి నవల 'ఏకాంతంలో చర్చి'ను అనుసరించి సర్దీనియాలోని సమాధి దగ్గరే ఒక చిన్న చర్చిని నిర్మించారు. దాని పేరు కూడా ఆ నవల పేరే- 'ఏకాంతంలో చర్చి'.

వాస్తవికవాద సృజనాత్మక రచయిత్రి డేలెడ్డా. తన ఒంటిచేత్తోనే ఆ ద్వీపం పౌరాణికాలతోను, కథలతోను సర్దీనియా సాహిత్యాన్ని ఆమె సృష్టించారని అక్కడి ప్రజలు భావిస్తారు.

- ముకుంద రామారావు, 9908347273

■ **నవరాగం**

ఇష్టాల్ని గమనిస్తున్నారా?

చూపులకే భాష వుంటే ఎన్నెన్నో భావాల్ని వ్యక్తం చేస్తాయని కవులు కవిత్వాలు రాస్తారు. కానీ చూపులకు భాష లేదని అనుకోకూడదు. వాత్సల్యం, ప్రేమ, ఆరాధన వంటి భావాల్ని చెప్పకనే తెలియజేస్తాయి కళ్ళు. ప్రేమప్రేమగా చూసేవారి చూపులోని మెత్తదనం, ప్రేమామృతం చెప్పకనే తెలిసిపోతాయి. కళ్ళల్లో కళ్ళు పెట్టి ఆ మూడు ముక్కలు చెప్పేయి... అని సినిమాల్లో అడుగుతుంటారు. ప్రేమని వాచ్యం చేయడం తెలుగు సినిమా దర్శకుల భావదారిద్ర్యం. గుండెలోని ప్రేమనంతా కళ్ళల్లో రంగరించి చూస్తుంటే, ప్రత్యేకంగా "ఐ లవ్ యూ" అని చెప్పాలా?

స్నేహం, సాన్నిహిత్యం, ఆరాధన, అనురాగం, ప్రేమ అనే భావాల్ని మాటల కన్నా చూపులే ఎక్కువగా అభివ్యక్తం చేస్తాయి. ఆరాధనతో కూడిన ప్రతి చూపు ప్రేమకు దారితీయదు. అలాగే ఆ చూపుల్లో కామభావన



కనిపించాలనేం లేదు. ఒక ముగ్ధమనోహరమైన పారిజాత పుష్పాన్ని ఇష్టంగా చూస్తున్న భావనే ఒక మనిషిని చూడటం లోనూ ఉండొచ్చు.

అమాయకంగా, ఇష్టంగా, అనురాగంతో కూడిన చూపుల్ని అర్థం చేసుకోగలిగితే మౌనంగా చూసే మనిషి మనసులోని భావాల్ని పసిగట్టడం సులువు. మనకు ఏమీ కాని మనుషుల్ని కూడా ఇష్టంగా చూడటం వుంటుంది. ఆ ఇష్టాలకు అర్థాలని వెదకనక్కర్లేదు.

పని ప్రదేశాల్లో ఇలాంటి ఇష్టాలు, ఆరాధనా పూర్వకమైన చూపులు సాధారణం. ఈ ఇష్టాలకు పెద్దగా కారణాలుండవు. అలాగే ఆ ఇష్టాలు ఎక్కడికో దారితీస్తాయని కూడా తలపోయక్కర్లేదు. కొందర్ని చూడటం ఆహ్లాదం. కొందరిని పలకరించడం హాయిదనం. హాయిగా నవ్వుతూ పలకరించే మనిషి కనిపించకపోతే ఏదో తెలియని దిగులు... "ఏమైపోయారు, మూడురోజుల్నుంచి కనిపించడం లేదు" అని పలకరిస్తారు. అంతమాత్రాన అపార్థం చేసుకోనక్కర్లేదు.

కళ్ళల్లోకి సూటిగా చూస్తూ మాట్లాడితే ఏ గొడవా వుండదు. అర్థాలకీ, అపార్థాలకీ అసలే తావుండదు. ఏదైనా ముఖానే చెప్పొచ్చు. ఎదుటివారి చూపుల్లో తెలియని మర్మం వుంటే తెలుసుకోడం మరింత సులువు. కానీ వ్యవహారికమైన సంభాషణల్లో సూటిగా చూస్తూ మాట్లాడటం మంచిది.

ఇలాంటప్పుడు తెలియకనే కనబరిచే స్నేహభావం వుంటే తెలిసిపోతుంది. అయితే స్నేహభావం తప్పు కాదు. ఆ స్నేహం, కలుపుగోలుతనం అభ్యంతరకరం కాదు. ఎందుకంటే మనుషులు బిర్రబిగుసుకు ఉండలేరు. ఉండక్కర్లేదు. జీవితకాలంలో ఎంతోమందిని కలుస్తుంటాం. కొందరితో స్నేహం చేస్తాం. ఆప్యాయంగా మాట్లాడుతాం. నవ్వుతూ పలకరిస్తాం. ప్రతి చూపు, ప్రతి సంభాషణ ఎక్కడికో దారితీస్తుందని అనుమానించేట్టయితే అసలు మనుషులు ఈలోకంలో మనగలరా? ఎవరితోనైనా మాట్లాడగలరా?

అందుకని నిప్పులేని చోట పొగను ఊహించకూడదు. కానీ అనుమానాలు మనిషి అస్తిత్వాన్నే నిరాకరించే దారుణానికి పురిగొల్పుతాయి. ఇవి దాంపత్య జీవితానికి భంగకరం. "పరస్పర వ్యక్తిత్వాల ఎదుగుదల మీద, మార్పుల మీద, ప్రేమను వ్యక్తపరచే విధానాల మీద పరస్పర గౌరవమున్నప్పుడే దాంపత్య జీవితం సఫలమవుతుంది" అంటారు ప్రముఖ రచయిత్రి పెరల్ ఎస్.బక్. ఇలాంటి వ్యక్తిత్వాలున్న చోట అనుమానాలకు తావుండదు. వందమంది ఆడవాళ్ళ మధ్య పనిచేసినా, అతను అక్కడ మనిషిగా మసలుకుంటాడు, తన దగ్గర మాత్రమే పూర్ణ పురుషునిగా ఉంటాడని గ్రహించగలరు. అలాగే వందమంది పురుషులు తిరుగాడే చోట పనిచేసే ఆమె తన దగ్గర మాత్రమే తన స్త్రీత్వపు ఉద్వేగాల్ని అలలు అలలుగా వ్యక్తం చేస్తూ అల్లుకుపోయే నెచ్చెలి అవుతుందని విశ్వసిస్తారు.

"ఈ ప్రపంచంలో నువ్వు మాత్రమే నాకున్న ఏకైక స్త్రీవి" అని చెప్పకనే చెప్పే చూపుల్లోని భావం గ్రహిస్తే అనుమానానికి తావెక్కడిది?

"ఈ లోకాన నేను స్త్రీనని గుర్తు చేసే సంపూర్ణ పురుషుడివి నువ్వు మాత్రమే" అని అలవికాని అనురాగంతో దరిచేరే స్త్రీ మనోమందిరంలో నిలిచాక ఇక అనుమానాలకు చోటెక్కడ?

ఈరకమైన ఇష్టాల్ని మాటల్లోనే కాదు, నిత్యజీవితాచరణలో చూపగలగాలి. ఇష్టాల వ్యక్తీకరణకి వయసుతో నిమిత్తం లేదు.

కొందరు ఇరవయ్యేళ్ళు కాపురం చేసినా అతనికి ఏ రంగు ఇష్టమో, ఏ పాట ఇష్టమో, ఏ మాట ఇష్టమో గ్రహించరు. అలాగే ఆమెలోని సున్నితమైన పార్శ్వాల్ని అతను గుర్తించడు. పరస్పరం ఒకరి ఇష్టాలు ఏమిటో మరొకరికి తెలియనంత కాలం కలిసి చేసే కాపురం ఏకాకి నౌక చప్పుడులా ఉంటుంది.

ఎగిసిపడే ఉద్వేగాలకు కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. ఒక చిన్న స్పర్శ చాలదా ఇష్టాన్ని వ్యక్తపరచడానికి. తన భాగస్వామికి అత్యంత ఇష్టమైన స్పర్శ ఏమిటో గ్రహించలేకపోతే మనుషుల సమాగమానికి అర్థం వుంటుందా? ఒక చూపు, ఒక స్పర్శ చెప్పలేని ఇష్టాల్ని మాటలు చెబుతాయా? మాటలు కూడా అవసరమే. తమకే ప్రత్యేకమైన పరిభాషలో గుసగుసలు పోవడమూ మధురానుభూతే. తమకే ప్రత్యేకమైన ఏకాంతంలో మనసు తుళ్ళిపడే మాటలు అనుభవ గాఢతని పరిమళింపజేస్తాయి. మెలకువలోంచి కలలోకి, కలలోంచి మెలకువలోకి చేసే బతుకు ప్రయాణాన్ని రాగరంజితం చేస్తాయి. అందుకే ఇష్టమైన ఒక మాట, ఒక చూపు, ఒక స్పర్శ మానవీయ ఉద్వేగాల వ్యక్తీకరణకు సోపానాలవుతాయి.

– ప్రణీత్

క్లౌడ్ టెక్నాలజీదే భవిష్యత్తు

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

అరచేతిలో ఆధునిక పరిజ్ఞానం... ఒక్క క్లిక్‌తో విశ్వ వీక్షణం. ఈ పరిజ్ఞానానికి స్వాగతం పలుకుతున్న సాంకేతిక యుగంలో మరో సరికొత్త ఆవిష్కరణ మానవాళిని అబ్బుర పరుస్తోంది. సర్వర్లకు, సాఫ్ట్‌వేర్లకు వేలాది రూపాయలు ధారపోయనక్కర్లేదు. సాధారణ కంప్యూటర్‌తోనైనా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవోకగా అందిపుచ్చుకోవచ్చు. జనజీవితంతో పెనవేసుకుపోయిన కంప్యూటర్‌కి ఒక కొత్త శక్తి తోడవబోతోంది. అదే క్లౌడ్ కంప్యూటింగ్. సరికొత్త సాంకేతికతకు పెట్టింది పేరు ఈ క్లౌడ్ టెక్నాలజీ. ప్రపంచాన్ని ఇంట్లో కూర్చుని చూసే కిటికీ లాటింది.

కంప్యూటర్‌తో చేసే ఏ పనినైనా కంప్యూటింగ్ అంటారు. ఇలాంటి కంప్యూటింగ్ సేవలన్నీ సిస్టమ్ ద్వారా కాకుండా డైరెక్ట్‌గా ఇంటర్నెట్ ద్వారా వాడుకోవడమే క్లౌడ్ కంప్యూటింగ్. మనం రోజువారీ వాడే కంప్యూటర్లలో ఏదైనా సాఫ్ట్‌వేర్ వుంటేనే మన అవసరానికి తగిన విధంగా ఉపయోగించుకోగలుగుతాం. దానికోసం సంబంధిత సాఫ్ట్‌వేర్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి వుంటుంది. ఈ క్లౌడ్‌తో కంప్యూటర్లలో సాఫ్ట్‌వేర్లను ఇన్‌స్టాల్ చేసుకునే ప్రక్రియకు తెరపడనుంది. ఇక్కడ కంప్యూటర్‌కు ఇంటర్నెట్టే ప్రాణం. ఇంటర్నెట్ వుంటే చాలు, డైరెక్ట్‌గా ఇంటర్నెట్ నుంచే ఏ పనైనా చేసుకోవచ్చు. అయితే ఇదంతా ఉచితం కాదు. అప్లికేషన్ల వాడకాన్ని బట్టి ఆయా సంస్థలకు కొంత మొత్తాన్ని చెల్లించాల్సి వుంటుంది.

క్లౌడ్ అనేది టెలీ కమ్యూనికేషన్స్‌కి సంబంధించిన పదం. ఇంటర్నెట్ నుండి కంప్యూటింగ్ చేయడానికి కూడా ఇదే పదాన్ని వినియోగిస్తున్నారు. దీనిలో సాఫ్ట్‌వేర్ యూజర్ సర్వీస్, హార్డ్‌వేర్ యూజర్ సర్వీస్, డేటాబేస్ యూజర్ సర్వీస్ అంటూ క్లౌడ్ కంప్యూటింగ్‌లో మూడు రకాలు. ముఖ్యంగా క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఫ్రంట్ ఎండ్, బ్యాక్‌ఎండ్ అనే రెండు సెక్షన్లు వుంటాయి. వినియోగదారుని(యూజర్) కంప్యూటర్‌లో ఎలాంటి డేటా వుండదు. ఏ ఇతర అప్లికేషన్లూ వుండవు. కేవలం ఆపరేటింగ్ సిస్టమ్ మాత్రమే వుంటుంది. కావాల్సిన అప్లికేషన్స్‌ను గానీ, సాఫ్ట్‌వేర్లను గానీ క్లౌడ్‌లోనికి వెళ్లి సెలెక్ట్ చేసుకోవచ్చు. వినియోగదార్లకు అందుబాటులో వుంచే వివిధ సంస్థల ద్వారా అవసరమైన అప్లికేషన్స్‌ను నేరుగా పొందొచ్చు. ఫ్రంట్‌ఎండ్, బ్యాక్‌ఎండ్ అనే రెండు సెక్షన్లు వినియోగంలోకి వచ్చేది ఇక్కడే. ఇవి ఇంటర్నెట్ ద్వారా కనెక్ట్ అవుతాయి. క్లయింట్ డివైజ్ ఫ్రంట్‌ఎండ్ సర్వీసులు పొందుతుంది. డివైజ్ అంటే మరేదో కాదు. పిసీ, ల్యాప్‌టాప్, టాబ్లెట్ పీసి, మొబైల్ ఇలా ఏదైనా కావొచ్చు. ఇక బ్యాక్‌ఎండ్ క్లౌడ్ సర్వర్‌ని అందిస్తుంది. అప్లికేషన్స్‌కు భారీగా ఖర్చు చేయాల్సిన అవసరం తప్పుతుంది. కేవలం డివైజెస్ వుంటే సరిపోతుంది. డేటాను, అప్లికేషన్స్‌ను ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా యాక్సెస్ చేసుకునే వీలుంటుంది. సాఫ్ట్‌వేర్ క్రాష్, డేటాలాస్ వంటి సమస్యలు అసలుండవు. అంతేకాదు కంప్యూటర్ వేగంగా పనిచేయడానికి మెమరీ కూడా పెద్దగా అవసరంలేదు. ఎందుకంటే... డేటా, అప్లికేషన్స్ నిర్వహణ మొత్తం క్లౌడ్ సర్వరే చూసుకుంటుంది. ఒక్కసారి క్లౌడ్‌కి కనెక్ట్ అయితే చాలు. సర్వీస్ మొత్తాన్ని దానితోనే పొందొచ్చు. మనకు అవసరమైన ప్రతి సాఫ్ట్‌వేర్, డేటాస్టోరేజీ, సినిమాలు, పాటలు, ఇలా హోమ్ అండ్ ఆఫీస్ యుటిలిటీస్‌ని క్లౌడ్ నుంచి పొందొచ్చు. అంతేకాదు.. క్లౌడ్ వస్తే పిల్లల స్కూల్ బ్యాగులకు స్వస్తి చెప్పొచ్చు. ఇప్పటికే కొరియన్లు డిజిటల్ టెక్ట్స్ బుక్స్‌కి ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలకూ చెక్ చెప్పొచ్చు. వ్యాపార రంగాన్నికూడా క్లౌడ్ కంప్యూటింగ్ తీవ్రంగా ప్రభావితం చేయనుంది.

చిన్నా చితకా కంపెనీలు మొదలుకొని పెద్దపెద్ద కంపెనీల వరకు సాఫ్ట్‌వేర్స్ కొనడానికి ఎంతో ఖర్చు భరించాల్సి వస్తోంది. అదే క్లౌడ్ కంప్యూటింగ్‌తో గంటకింతని చెల్లించి ఇంటర్నెట్‌నుంచి సాఫ్ట్‌వేర్‌ని ఉపయోగించుకోవచ్చు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఇంటర్నెట్ సర్వర్‌ని, అవసరమైన మేరకే డిస్క్ స్పేస్‌ని వాడుకోవచ్చు. దానికి మాత్రమే అద్దె కడితే సరిపోతుంది. ఫ్యూచర్‌లో హార్డ్‌డిస్క్, మైక్రో ఎస్‌డి కార్డులతో పనే వుండదు. సిస్టమ్ ఆన్ చేయగానే ఇంటర్నెట్‌కి కనెక్ట్ అయిపోయి, క్లౌడ్ స్టోరేజిని వాడుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. ఇక్కడ పబ్లిక్, ప్రైవేట్, హైబ్రీడ్ క్లౌడ్ అంటూ మూడు సర్వీసులుంటాయి. అంటే పబ్లిక్ క్లౌడ్‌ని మోడల్ స్టాండర్డ్ క్లౌడ్ కంప్యూటింగ్ అని కూడా అంటారు. ఇంటర్నెట్‌లో యాక్సెస్ చేయగలిగిన అప్లికేషన్లను, స్టోరేజ్ సర్వీస్‌ను ఈ క్లౌడ్ ద్వారా అందిస్తారు. ప్రైవేట్ క్లౌడ్‌ని పరిమితంగానే వినియోగించే వీలుంటుంది. ప్రైవేట్ ఆర్గనైజేషన్స్‌కి డేటామీద కంట్రోల్ ఇవ్వడమే దీని కాన్సెప్ట్. ఇక హైబ్రీడ్ క్లౌడ్‌ను ఐడియల్ మోడల్‌గా చెప్పొచ్చు. ఇందులో డేటాకి, అప్లికేషన్స్‌కి సెక్యూరిటీ ఎక్కువ.

2016నాటికి ప్రపంచ వ్యాప్తంగా 15మిలియన్ల కొత్త ఉద్యోగాలు వచ్చే అవకాశముందని, క్లౌడ్ మార్కెట్ 25బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. భారత్‌లో క్లౌడ్ మార్కెట్... 2లక్షల కోట్ల డాలర్ల మేర వుండొచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ మార్కెట్‌ను అందిపుచ్చుకోవాలని గూగుల్, ఐబిఎం లకు పోటీగా మైక్రోసాఫ్ట్ ప్రణాళికలు రచిస్తోంది. భారత్‌లో క్లౌడ్ కంప్యూటింగ్

టెక్నాలజీకి అపార అవకాశాలున్నాయని, 2015 కల్లా మూడు నగరాల్లో క్లౌడ్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని, భవిష్యత్తు అంతా క్లౌడ్ టెక్నాలజీదేనని, భవిష్యత్తులో క్లౌడ్ లేని మొబైల్స్‌ను ఊహించలేం అని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల చెబుతున్నారు.

ఇదంతా ఒకవైపు. దీనికి రెండోవైపు.. మొట్టమొదటిగా తలెత్తే ప్రశ్న.. క్లౌడ్‌లో వుండే డేటాకు భద్రత వుంటుందా? అనేది. ఎన్ని సాఫ్ట్‌వేర్లు అందుబాటులోవున్నా హ్యాకర్ల దాడిని తట్టుకోలేకపోతున్నాం. ఎన్ని లాక్‌లు వేసినా సమాచారం ఏదోకదారిలో వెళ్లిపోతూనే వుంది. మామూలుగానే హ్యాకర్లను అదుపుచేయడం చాలా కష్టం. ఈ క్లౌడ్ కంప్యూటింగ్‌తో వీరి అకృత్యాలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. ప్రతిసారీ డేటా సురక్షితంగా వుంటుందన్న నమ్మకం వుండకపోవచ్చు. హ్యాకర్లు వెబ్ సర్వర్లపై దాడి చేసే అవకాశాలూ ఎక్కువే. అందుకే క్లౌడ్ కంప్యూటింగ్ సంస్థలు సర్వర్ల భద్రతపై మరింత పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాల్సి వుంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తమ సమాచారాన్ని బయటికి పొక్కదనే నమ్మకాన్ని వినియోగదారులకు కలిగించాలి. అప్పుడే క్లౌడ్ కంప్యూటింగ్ సేవలు మరింతగా విస్తరిస్తాయి. గతంలో ప్రతి సమాచారం మ్యాన్యువల్‌గానే వుండేది. ఇప్పుడది హార్డ్‌డిస్కుల్లోకి చేరింది. హార్డ్‌డిస్క్ చెయ్యిమారితే చాలు... ఆ కంపెనీ గుట్టుమట్లన్నీ ఒడిసి పట్టుకోవచ్చు. ఇదీఅంతే. క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా వచ్చే నష్టాలను, ఎదురయ్యే సమస్యలను ముందే ఊహించి, వాటికి తగిన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవాల్సి వుంటుంది.

రచయిత సెల్ : 9490099219

■ **సమీక్షలు**

మానవ ఉద్వేగాలకి కథారూపం



చిట్టచివరి రేడియో నాటకం (కథలు)
రచన: డాక్టర్ వి.చంద్రశేఖరరావు
పేజీలు: 352,
వెల: రూ. 250.
ప్రతులకు:
విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

దాదాపు రెండున్నర దశాబ్దాలుగా తన సృజనాత్మక ప్రయాణాన్ని కొనసాగిస్తున్న రచయిత డాక్టర్ వి.చంద్రశేఖరరావు. ఇప్పటివరకు నాలుగు కథా సంపుటాలు వెలువరించారు. మూడు నవలలు రాశారు. ఆయన రాసిన కథల్లోంచి 31 కథల్ని ఎంపిక చేసి 'చిట్టచివరి రేడియో నాటకం' శీర్షికన 'విశాలాంధ్ర' ప్రచురించింది. గత మూడు నాలుగు దశాబ్దాల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల ప్రభావం ప్రజల జీవితాల మీద ఏవిధంగా వుందో ఈ కథలు చెబుతాయి. సాహిత్యంలో ఉండాల్సిన సౌందర్యాన్ని విస్మరించకుండా ప్రజల జీవితాల్లో వస్తున్న మార్పుల్ని చెప్పడం ఈ రచయిత కౌశలం. కథని అందంగా, మార్మిక కవిత్వంలా అందించడం చద్రశేఖరరావుది ప్రత్యేక శైలి.

వర్తమానం-గతం-వర్తమానం అనే పద్ధతిలో ఎక్కువమంది కథలు రాస్తుంటారు. ఇందుకు భిన్నంగా మాంత్రిక వాస్తవికతను తన కథనశిల్పంగా మలుచుకున్నారు. ఒక వాస్తవాన్ని సాధికారికమైన సత్యంగా ఆవిష్కరించే క్రమంలో పాత్రలు రూపాంతరం చెందుతాయి. అనేక వాస్తవాల సమ్మిళితమై కథల్లోని సంఘటనలు, సన్నివేశాలు దర్శనమిస్తాయి.

జీవితంలో కనిపించని విషాద బీభత్సాన్ని కళాత్మకంగా చెప్పడంలో చంద్రశేఖరరావు వినూత్న పద్ధతిని అనుసరించారు. ఈ క్రమంలో కొన్ని పాత్రలు చాలా కథల్లో తారసపడతాయి. మోహన సుందరం, సుందరం, మాలతి, మోహిని వంటి పాత్రల పరిణామాల్ని దగ్గరగా చూస్తాం. 'మోహనా! మోహనా!' అనే కథలో "ప్రదేశాలు మారినా మళ్ళీ అవే దృశ్యాలు. మళ్ళీ మళ్ళీ పునరావృతం. మనుషులు వాళ్ళే, వాళ్ళ కళ్ళలోని ఆశలు అవే" అంటారు. ఈ కథలకు కూడా ఈ మాట వర్తిస్తుంది. ఉస్మానియా క్యాంపస్ ఈ రచయితకు ఒక అబ్సెషన్. క్యాంపస్ ప్రస్తావన చాలా కథల్లో దర్శనమిస్తుంది. విప్లవోద్యమాలు, దళిత ఉద్యమాలు, వాటికి జరిగిన ద్రోహాలు, మార్క్సిజం మీద ప్రగాఢమైన విశ్వాసం... ఏనాటికయినా ఈదేశంలో విప్లవం సాధ్యమన్న ఆశాభావం... కథలన్నిటా మార్మికంగా పరుచుకుని వుంటుంది. సాధారణంగా కనిపించే సన్నివేశాల్ని, సంభాషణల్ని అసాధారణమైన రీతిలో దృశ్యమానం చేసే కళని చంద్రశేఖరరావు కథల్లో చూస్తాం. చదవడం మొదలు పెడితే కుతూహలంతో కథల వెంట ప్రయాణిస్తాం. మానవ ఉద్వేగాలకి కళారూపం ఇవ్వడం ఈ రచయితకి బాగా తెలుసనని ఈ కథలు చెబుతాయి.

- శశాంక

ఉపకరించే వృత్తిపదకోశం

మాండలీకం, సంకలనం: భూతం ముత్యాలు,
ఎడిటర్: వేముల ఎల్లయ్య
పేజీలు: 162, వెల: రూ. 100.
ప్రతులకు: భూతం ముత్యాలు
4-11-117/1, చైతన్యపురి కాలనీ
(ఎల్.హెచ్.సి.రోడ్డు),
డి.వి.కె.రోడ్డు, నల్లగొండ-508 001

భారతీయ సమాజంలో కులం వాస్తవం. కులంతో ముడిపడిన వృత్తులు అనేకం. ఆయా వృత్తులకు ప్రత్యేకమైన పరిభాష వుంటుంది. సర్వసాధారణమైన వ్యవహారికంతోపాటు ఆయా కులాల సంస్కృతినీ, వృత్తి వైవిధ్యాన్నీ ప్రతిఫలించే భాష వుంటుంది. సహజంగా ఆయా కులాల వాడుకలో వుండే కుల మాండలికాల్లోనే ప్రత్యేకమైన పదజాలం వుంటుంది. మరి ఆ పదజాలానికి సంబంధించిన ఒక పదకోశాన్ని భూతం ముత్యాలు రూపొందించారు. దీని వెనుక విశేషమైన కృషి వుంది. ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ముత్యాలు మంచి కవి, రచయిత. గ్రామీణ జీవితపు చలనసూత్రాలు, భాషావ్యవహారాలు అతని రక్తంలోనే సమ్మిళితమై వున్నాయి. కనుక 'మాండలీకం' శీర్షికన తెలంగాణ కుల వృత్తి పదకోశం తీసుకొచ్చారు. ఈ పుస్తకానికి ఎడిటర్‌గా వేముల ఎల్లయ్య వ్యవహరించారు. నల్లగొండ లోని 'గుంపు' సాహితీ సంస్థ దీనిని ప్రచురించింది. క్షేత్రస్థాయి అస్తిత్వ అనుభవం, పరిశీలన, పరిశోధనా దృష్టి, నిజాయితీతో కూడిన శ్రమ వల్లనే ఈ పుస్తకం రూపొందింది. భాషా శాస్త్రజ్ఞులు చేయాల్సిన కృషిని ముత్యాలు ఎంతో శ్రమకోర్చి నిర్వహించారు. తెలంగాణలో భాషాశాస్త్ర పరిశోధనలకు మంచి ఉపకరణం ఈ గ్రంథం. అంతేగాదు, వృత్తిపదకోశాల నిర్మాణం ఇతరులు గుర్తిస్తారు ఈ పుస్తకం చదివాక. కనుక భూతం ముత్యాలు చేసిన ఈ ప్రయత్నం అభినందనీయం. మాండలికంపై ఆసక్తిగల వారు మాత్రమే కాదు, తెలుగు భాష, సాహిత్యరంగాల్లో వున్నవారు అవశ్యం చదవాల్సిన గ్రంథం.

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటి రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా:
సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక,
ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్,
ఇండస్ట్రియల్ ఏరియా,
బాగలింగంపల్లి, హైదరాబాద్-500030.

ప్రజావైద్యుడు

డాక్టర్ సత్యాపాల్‌తులి



ప్రజావైద్యుడు విప్లవకారుడు
డాక్టర్ సత్యపాల్ తులి
సుందరయ్య విజ్ఞానకేంద్రం
పేజీలు :72 ,
వెల : 25/-
ప్రతులకు :
ప్రజాశక్తి అన్ని పుస్తక కేంద్రాలు

కమ్యూనిస్టులకు వ్యక్తిగతం అనేది వుండదు అని చెప్పడానికి తులిగారి జీవిత సంగ్రహం చదివితే అర్థం అవుతోంది. ఆయన జీవితమంతా పువ్వుల దండలో దారంలాగా ప్రజల మధ్యనే సాగిపోయింది. తెలంగాణ సాయిధ పోరాట యోధులు నంద్యాల శ్రీనివాస్‌రెడ్డిగారి మాటలో చెప్పాలంటే "నార్మన్ బెతూన్ డాక్టర్ కోట్నీస్‌ల తరగతికి చెందిన విప్లవకారుడైన వైద్యుడు. ఎక్కడో పాకిస్తాన్‌లోని సియోల్‌కోటలో పుట్టి దేశవిభజన సందర్భంగా యావత్తు కుటుంబం హత్యచేయబడిప్పటికీ, మొక్కవోని విప్లవ చైతన్యంతో చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయిధ పోరాటానికి వైద్యునిగా సహకరించడానికి వచ్చిన విప్లవ వైద్యుడు తులి.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యంగారు స్వయంగా తన అనుభవం వ్రాస్తూ..."మొండిరోగాలకు వైద్యం చేయడంలో మొనగాడు తులి" అని కితాబిచ్చారు. "నాకు ఉబ్బసం ఉంది. వారసత్వంగా సంక్రమించింది. జర్మనీ నుండి హోమియో మందులు తెప్పించారు. నారక్తం ఇంజెక్షన్ ద్వారా తీసి దానికి ఈ మందును ఎక్కించి మళ్లీ ఆ రక్తాన్ని ఇచ్చేవారు. నాకు పూర్తిగా ఉబ్బసం నయం చేశారు. ఆయన వైద్యం వల్ల నాకు పునర్జన్మ కలిగింది" అన్నారు.

డాక్టర్ తులి పంజాబ్ రాష్ట్రంలోని సియోల్ కోటలో 1919 సెప్టెంబర్ 10న జన్మించారు. అమృతసర్ వైద్య కళాశాలలో 1944 సం॥లో వైద్యకోర్సు పూర్తి చేశారు. వైద్య వృత్తికే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా పరోక్షంగా కార్మిక సంఘాల నిర్మాణంలో అభ్యుదయ ఉద్యమాల నిర్మాణంలో పాల్గొన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడే దేశం పరాధీనమై, సామ్రాజ్యవాద దుష్ట పాలనలో ప్రజలు అనునిత్యం పడుతున్న బాధలను చూసి ఆయన హృదయం తల్లడిల్లేది. ఆ రోజులలోనే సియోల్‌కోటలో ఒక చోట జాతీయజెండా ఎగురవేయుటకు నాయకులు నిర్ణయించారు. ఎగురవేయకుండా చూడాలని ప్రభుత్వం పంతం పట్టింది. ఆ స్థలంలో పోలీసులను సమీకరించింది. జెండా ఎగురవేయటానికి ప్రయత్నించిన వారిని కాల్చేస్తారన్న వదంతులు పట్టణమంత వ్యాపించాయి. ఈ దశలో డజను మంది విద్యార్థులతో రంగంలోకి ప్రవేశించారు. ఆ స్థలాన్ని చుట్టుముట్టివున్న పోలీసుల దృష్టి మరోవైపు మళ్ళించి జెండాను ఎగురవేయటానికి ఒక ప్లాన్ సిద్ధ పరిచారు ఈ స్థలానికి కొద్ది దూరంలో కొద్దిపాటి అల్లరి సృష్టించారు. జెండా ఎగురవేసే స్థలాన్ని మార్చారేమోననే భ్రమలో వుండి పోలీసులు అటుగా పరుగెత్తారు. తులి జెండాను ఎగురవేశాడు. ఇది అతని సాహసానికి ఒక ఉదాహరణ.

1948 సం॥ ముగింపులో కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతుకూలీలకు వైద్య సహాయం అందించమని కోరింది. ఆయన హైదరాబాద్ వచ్చి సుందరయ్యగారిని కలిసి కేంద్ర కమిటీ వ్రాసిన లేఖను అందించాడు. అప్పటినుండి హైదరాబాద్‌లో డిస్పెన్సరి నడిపిస్తూ విప్లవకారులకు రక్షణ సహాయాలు అందించారు. పోరాటాలలో ఉరిశిక్షలు, యావజ్జీవ శిక్షలు పడ్డవారిని రక్షించటానికి న్యాయవాదుల గ్రూపు ఏర్పాటు చేసి తోడ్పడ్డాడు. పోరాట విరమణ అనంతరం వైద్యం నిమిత్తం వచ్చిన నాయకులతో "భయ్యా... బందుక్ అబ్ బాజురఖో అబ్ బాతోంసే లడాయి కర్నాహై".. అని చెప్పేవారు. తన దగ్గరకు వచ్చిన అతివాద మితవాద నాయకులందరికీ వైద్య సేవలనందించాడు. తన సంపాదన అంత పార్టీకి ఇచ్చాడు. జీవితాంతం బ్రహ్మచారిగా వున్నాడు.

ఆయనకు వైద్యం యెడల ఎంతో ఆపేక్ష. వైద్య విద్యార్థులను తన వద్ద చేర్చుకొని వైద్యంలో వస్తున్న మార్పులను తెలియజెసేవారు. అట్లా వచ్చిన డాక్టర్ శ్యామలాంబ గారు తులిగారు చనిపోయేవరకు వారి వెంటవుండి స్వంత బిడ్డలాగా సేవచేశారు. డాక్టర్ తులి లింపుసర్కోమ అనే వ్యాధితో 1976 మే 26న మరణించారు. పార్టీ నాయకత్వం ఎమర్జన్సీ కారణంగా జైళ్ళలో, రహస్య జీవితంలో ఉండటం వలన రాష్ట్ర కేంద్రం తరపున ఉద్దరాజు రామం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన చనిపోయినా, ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఎస్‌వికె తులి జీవనదార జనరిక్ మందులు పేదలకు తక్కువ ధరలకే అమ్ముతున్నారు. ఇది అందరు చదవాల్సిన పుస్తకం.

- గడ్డం రమేష్

1948 సం॥ ముగింపులో కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతుకూలీలకు వైద్య సహాయం అందించమని కోరింది. ఆయన హైదరాబాద్ వచ్చి సుందరయ్యగారిని కలిసి కేంద్ర కమిటీ వ్రాసిన లేఖను అందించాడు. అప్పటినుండి హైదరాబాద్‌లో డిస్పెన్సరి నడిపిస్తూ విప్లవకారులకు రక్షణ సహాయాలు అందించారు. పోరాటాలలో ఉరిశిక్షలు, యావజ్జీవ శిక్షలు పడ్డవారిని రక్షించటానికి న్యాయవాదుల గ్రూపు ఏర్పాటు చేసి తోడ్పడ్డాడు.

■ ఈ వారం కవిత్వం

బలమైంది మన స్నేహవారధి

మనం కలిసి నడుస్తున్నాం
స్నేహాల్ని ఒంపుకుంటున్నాం
మేం మిమ్మల్ని మీరు మమ్మల్ని
అలనుకరించట్లేదు అదే పనిగా...

జ్ఞాపకాల నీడల్లో నడుస్తున్నాం
తీపితీపి గురుతులు పంచుకుంటున్నాం

చేదు దినాల దు:ఖనదుల్ని దాటినాం
ఒకరి మీద మరొకరం ఆధిపత్యం
అజమాయిషీ హుకుం చెలాయించట్లేదు
లోకాన్ని వీక్షిస్తున్నాం
అనుభవ సారాంశాన్ని వడబోస్తున్నాం
వీణలు వేరైనా మీటే మధురగానం ఒక్కటే
పాలన స్వామ్యాలు వేరైనా చేరాల్సిన ఒక్కటే

గగన సదృశం కాదు మన ప్రయాణ ప్రణాళిక
పంచశీల కలసి రచించుకున్నదే...

ఎడతెగని చర్చల పొదిలో
గుబాళిస్తోంది మన స్నేహపరిమళం
ఎవరెన్ని చిచ్చులు పెట్టాలనీ చూసినా
చిత్తయి చతికల పడిపోతారు గిట్టనివారు

పద్ధతులు వేరైనా భావ సముచ్చం ఒక్కటే
ఎలుగెత్తి... స్వరధునిలో పాడే బృందగానం ఒక్కటే
ధర్మచక్రం అరుణారుణ నక్షత్రకాంతుల స్నేహగీతం
వినువీధుల్లో ప్రతిధ్వనిస్తూ ఉంది!

తొణకని బెణకని బీటలు వారని
బలమైన పునాదుల మీద నిర్మించుకున్న
ఆదర్శంతమైన మన స్నేహవారధి!
(ఇటీవల చైనా అధినేత జిన్‌పింగ్ భారత పర్యటన సందర్భంగా)

- డా॥ దామెర రాములు
రచయిత సెల్ : 98664 22494

ఎర్కలె!

తీరిగ్గా ఉన్న దినం తిర్గి సూసుకుంటా. తీరొక్క రంగుల నిన్ను కళ్ళ నిండా నింపుకుంటా.
ఏ గుట్టకు ఎక్కబోతివో, ఏ కొసకే యేలాడుతుంటివో... తల్సుకొని తల్సుకొని కండ్ల నీళ్ళు పెట్టుకుంటా.
ఏడ్వలేకా, నవ్వలేకా ఏదో వోటి రాసుకుంటా.

యాదుందా? మన ఆకాశం మట్టి కొట్కబోయినపుడు, సుక్కలన్నీ పట్టుదప్పి
బోర్లబొక్కల బడ్డపుడు, పోట్రయి దగిలీ నీ బొటనేలు పగిలి- నడవలేక నన్ను కావలించుకున్నపుడు, ఎగర్లేక నన్ను ఎత్తుకోమన్నపుడు...
సిమ్మసీకట్లో, ఉరుస్తున్న పూరిగుడిసెలో, ఉర్మితున్న దుక్కమ్మీద నీ సూపులు మెరిసినపుడు...

గీ జనాలు ఎన్ని మాటలన్నా వాళ్ళకే దగుల్తయని సర్దిచెప్పుకున్నం.
పాతాళగరిగేశి ఎతికి ఎతికి బాయిలబడ్డ ఎన్నెల్ని బయటికి పట్కొచ్చినం. ఏం ఫాయిదా?!

ఎందుకైతదో గిట్ల! గాచారం బాలేని యాల - కాలం కుంటిదైతది. నెత్తురు ఎండి, నెర్రెలు దేలి- పొద్దుగూకే పాణం పోపోమ్మంటది.
దమ్ము దమ్ముకి బొక్కలు పిల్లనగర్రలై పాటలు పాడుతయ్. ఊపు ఊపుకి ఉయ్యాల పురిదేలుకుంటూ ఊగిపోతది.

నాటేసి, కలుపుదీసి, కుప్పనూర్చిన బతుకు- గాల్దుమారాంల గలిసి గాయబైతోపది.
గుండెల దిగబడిన మొండికత్తి నడిమీకి ఇర్గిపోయి నవ్వుమంటుంటది.

ఎర్కలె! ఎందుకు వదిలేశినవోగాని - జనాల మాటలుదగిలి నువ్ యెళ్ళిపోయినంక - పూలూ, పిట్టలూ, వాడిపోయినట్టూ....
సెరువూ, సెట్టూఎండిపోయినట్టూ... పొలమూ, పొద్దూ సచ్చిపోయినట్టూ... నేనొక్కన్నే మిగిలిపోయినట్టూ...

పొద్దుపొద్దున్నే ఓ కలబడ్తది. కూలబడేదాక యెంబడిస్తది. తీరిగ్గా ఉన్న దినాన్ని సుతం పర్కిపొదల్లోకి ఇసిరిపోతది.

- నందకిశోర్, 87128 29212

ఈ పూలను చూశారుగా రకరకాల ఆకారాల్లో ఎంత ఆకర్షణీయంగా ఉన్నాయో... ఇవి ఆర్కిడేసీ కుటుంబానికి చెందిన ఆర్కిడ్ పూలు. ఈ పూలల్లో ఎన్ని రకాల జాతులుంటాయో వాటిలోని పూలు అన్ని రకాల ఆకారాల్లో ఉంటాయి. వాటిలో కొన్నే ఇక్కడున్నవి. రామచిలుక, రాబందు, పక్షి, పులి తల, డాన్సింగ్ గర్ల్స్, టవల్‌లో చుట్టిన బేబీ, నర్తకి, ఏలియన్... ఇలా ఎన్నో రూపాల్లోని పూలను చూస్తుంటే తమాషాగా ఉంది కదూ!

పూల సొరంగం

హరివిల్లును తెచ్చి సొరంగంగా మలిచారా అనిపించేలా ఉన్న ఈ పూల వంతెన జపాన్‌లోని కవాచి ఫుజీ గార్డెన్‌లోనిది. జపాన్ వాసులకు పూలంటే చాలా ఇష్టం. అందులోనూ విస్టీరియా పూలంటే మరీ ఇష్టం. అందుకే 20 రకాల విస్టీరియా జాతిలోని 150 మొక్కలతో ఈ పూల సొరంగం తయారు చేశారు. ఈ సొరంగం గుండా ప్రయాణం చేస్తుంటే మైమరచిపోతారందరూ.